



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక : 305 పేజీలు : 8+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి గురువారం 10 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

### కృష్ణా జలాలపై మంత్రి ఉత్తమ్ సంచలన వ్యాఖ్యలు

- ఏపీకి మేలు చేసేలా కేసీఆర్ సర్కార్ వ్యవహరించిందన్న ఉత్తమ్
- రాయలసీమ లిఫ్ట్ టెండర్లకు పరోక్షంగా సహకరించారని విమర్శ
- పదేళ్లలో కీలక ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని వ్యాఖ్య

హైదరాబాద్ పెన్ పవర్:గత పదేళ్ల పాలనలో కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇది ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేసేందుకు జరిగిన కుట్ర అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వం కీలక ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్లే రాష్ట్రం తన హక్కులను కోల్పోయిందని ఆయన విమర్శించారు. బుధవారం ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,

వివరాలు 2లో..



## కేసీఆర్, జగన్ అనుబంధంతో
# తెలంగాణకు తీరని నష్టం

- కేసీఆర్, జగన్‌పై మరోసారి రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, జగన్ బంధంతో తెలంగాణకు తీవ్ర నష్టం
- కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ నిర్ణయాలు ఓ మరణశాసనం
- రాయలసీమకు మేలు చేసేలా కేసీఆర్ వ్యవహరించారని ఆరోపణ
- జూరాల నుంచే నీళ్లు తెచ్చుకుంటే ఏపీకి అవకాశం దక్కేది కాదు
- కేసీఆర్ వల్లే రాష్ట్రానికి విద్యుత్ భారం పెరిగిందన్న రేవంత్ రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:మాజీ ముఖ్యమంత్రులు కె. చంద్రశేఖర్ రావు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మధ్య ఉన్న అనుబంధం కారణంగా తెలంగాణకు పూడ్చలేని నష్టం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిం చారు. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర రైతాంగానికి మరణశాసనంగా మారాయని ఆయన ఆరోపించారు. బుధవారం కృష్ణా జలాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం సీఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు."బేసిన్లు, బేషజాలు లేవంటూ కేసీఆర్ గతంలో అన్నారు. గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, వాటిని కృష్ణా, పెన్నా బేసిన్లకు తరలించి రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పారు.

వివరాలు 2లో..

## రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాక ఏం చేస్తానంటే?



- రాజకీయాల నుంచి వైదొలిగాక తన ప్రణాళిక చెప్పిన అమిత్ షా
- వేదాలు, ఉపనిషత్తులు చదువుతానన్న కేంద్ర మంత్రి
- ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెడతానని వెల్లడి
- రసాయన ఎరువులతో ఆరోగ్య సమస్యలని హెచ్చరిక
- హెూం శాఖ కన్నా సహకార శాఖే తనకు పెద్దదని వ్యాఖ్య

వివరాలు 2లో..

## ఒవైసీ కాలేజీని కూల్చివేయకపోవడంపై
## హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందన

- పాతబస్తీ సూరం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఒవైసీ ఫాతిమా కాలేజీ
- 10 వేల మందికి పైగా పేద ముస్లిం యువతులు చదువుకుంటున్నారన్న రంగనాథ్
- మానవతా దృక్పథంతో కూల్చివేత చర్యలను నిలిపివేశామని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:పాతబస్తీలోని సూరం చెరువు పరిరక్షిత ప్రాంతంలో (ఎఫ్‌టీఎల్) ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నిర్మించిన ఫాతిమా కాలేజీ కూల్చివేతకు సంబంధించి వెల్లువెత్తుతున్న విమర్శలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. సామాన్యుల నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు, ఒవైసీ కాలేజీ విషయంలో ఎందుకు మినహాయింపు ఇస్తున్నారని వస్తున్న ప్రశ్నలకు ఆయన వివరణ ఇచ్చారు. ఈ విషయంపై ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ... "ఫాతిమా కాలేజీని ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించినందున గత ఏడాది సెప్టెంబర్‌లోనే కూల్చివేసేందుకు ప్రయత్నించాం. అయితే,

వివరాలు 2లో..

## ప్రాజెక్టులకు జలకళ..
## నాగార్జున సాగర్‌కు భారీ వరద



హైదరాబాద్ పెన్ పవర్:మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు తెలంగాణలోని ప్రాజె క్టులకు జలకళ సంతరించుకుంది. జూరాలా, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతోంది. దీంతో జూరాల ప్రాజెక్టు, శ్రీశైలం ప్రాజెక్టు గేట్లుఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువనుంచి జూరాల ప్రాజెక్టుకు లక్షా 25వేల క్యూసెక్కుల పైగా వరద వచ్చి చేరుతోంది.

వివరాలు 2లో..

## చైనాతో కాదు, టిబెట్‌తోనే
## మాకు సరిహద్దు

### అరుణాచల్ సీఎం పెమా ఖండు కీలక వ్యాఖ్యలు



- అరుణాచల్‌కు చైనాతో సరిహద్దు లేదన్న సీఎం పెమా ఖండు
- తమ సరిహద్దు టిబెట్‌తోనేనని వ్యాఖ్య
- టిబెట్‌ను చైనా బలవంతంగా ఆక్రమించుకుందని వెల్లడి

వివరాలు 2లో..

## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు అరెస్ట్

- ఐపీఎల్ టికెట్ల వివాదంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు అరెస్ట్
- జగన్మోహనరావుతో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్న సీఐడీ
- గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలెత్తిన గొడవ
- విజిలెన్స్ నివేదిక ఆధారంగా సీఐడీ చర్యలు
- ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చినట్టు నిర్ధారణ
- కార్పొరేట్ బాక్స్‌కు తాళం వేయడంతో ముదిరిన వివాదం



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ క్రికెట్ అసోసి యేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహనరావును సీఐడీ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఫ్రాంచైజీతో టికెట్ల విషయంలో తలెత్తిన వివాదమే ఈ అరెస్టుకు దారితీసింది. ఆయనతో పాటు మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. గత ఐపీఎల్ సీజన్ సందర్భంగా హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ యాజమా న్యం మధ్య టికెట్ల కేటాయింపుపై తీవ్ర విభేదాలు తలెత్తాయి. తమకు టికెట్లు కేటాయించలేదనే కారణంతో హెచ్‌సీఏ

వివరాలు 2లో..

## ఈ నెల 17న ఒక్క రైలును
## కూడా కదలనివ్వం

- 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలన్న కవిత
- ఎన్డీయేలో బీసీ వ్యతిరేకత పాతుకుపోయిందని విమర్శ
- స్థానిక ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేయదని స్పష్టీకరణ



హైదరాబాద్ పెన్ పవర్:బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంతో ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతు న్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురా లు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న తలపెట్టిన 'రైల్ రోకో'ను

వివరాలు 2లో..

### ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాలు..
## ప్రియాంక గాంధీతో డీకే శివకుమార్ కీలక భేటీ

- ఢిల్లీలో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో సమావేశమైన డీకే శివకుమార్
- కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై మళ్లీ ఊపందుకున్న ఊహాగానాలు
- ప్రియాంక గాంధీతో భేటీ అనంతరం మాట్లాడకుండా వెళ్లిన శివకుమార్
- త్వరలో అధిష్టానంతో సిద్ధరామయ్య కూడా భేటీ అయ్యే అవకాశం

హైదరాబాద్ పెన్ పవర్: కర్ణాటక రాజకీయాల్లో ము ఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చనీ యాంశమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీతో సమావేశం కావడంతో

వివరాలు 2లో..



## వారిని కాల్చిపారేయండి
## షేక్ హసీనా ఆడియో లీక్.. బంగ్లాదేశ్‌లో కలకలం

- బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా సంచలన ఆడియో లీక్
- నిరసనకారులను కాల్చివేయాలని పోలీసులకు ఆదేశాలు
- గత ఏడాది రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనల నాటి ఘటన
- బీబీసీ పత్రాల ఆధారంగా వెలుగులోకి వచ్చిన ఉదంతం
- అల్లర్లలో 1400 మంది మృతి చెందారని ఐక్యరాజ్యసమితి అంచనా
- ప్రస్తుతం భారత్‌లో తలదాచుకుంటున్న షేక్ హసీనా



హైదరాబాద్ పెన్ పవర్:బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు సంబం ధించిన ఒక కీలకమైన ఆడియో లీక్ కావడంతో రాజకీయంగా పెను ప్రకం పనలు సృష్టిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లకు వ్యతిరేకం గా గత సంవత్సరం జరిగిన ఆందోళనల సమయంలో నిరసనకా రులపై కాల్పులు జరపాలని ఆమె స్వయంగా ఆదేశించినట్లు ఈ ఆడియోలో ఉంది. ఈ ఉదంతం ఇప్పుడు బంగ్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. బీబీసీకి చెందిన పత్రాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా

వివరాలు 2లో..

## రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్రమంత్రి గ్రీన్ సిగ్నల్..
## యూరియా అధిక వాడకంపై ఆందోళన



- తెలంగాణకు అవసరమైన యూరియా సరఫరాకు జేపీ నడ్డా హామీ
- ఎరువుల సరఫరాకు మంత్రి జేపీ నడ్డా ఆదేశాలు
- యూరియా వాడకం 21 శాతం పెరగడంపై కేంద్రం ఆందోళన
- ఎరువులు పక్కదారి పట్టకుండా చూడాలని అధికారులకు సూచన
- సేంద్రియ సాగుకు 'ప్రణామ్' పథకం ద్వారా ప్రోత్సాహం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణకు అవసరమైన యూరియా కోటాను పెంచాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. రాష్ట్ర రైతాంగానికి ఎరువుల కొరత రాకుండా చూస్తామని హామీ ఇచ్చింది. అయితే, అదే సమయంలో రాష్ట్రంలో యూరియా వాడకం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది.ఇటీవల

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మంత్రులూ ఇక రోజులు లెక్క పెట్టుకోండి.. చాలా టైం చూశా

మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక రోజులు లెక్కపెట్టుకోవాల్సిందేనని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంత్రి పదవి చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ ఇంకా మంత్రుల పనితీరును మార్చుకోకుంటే ఎలా అని ప్రశ్నించారు. అసలు మంత్రులు ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉందని అసహనం వ్యక్తం చేశారు. విపక్షాలు చేస్తున్న విమర్శలకు సరైన కౌంటర్ ఇవ్వడంలో కూడా మంత్రులు విఫలమవుతున్నారని, వైసీపీ నేతలు మహిళ ఎమ్మెల్యేలను కించపర్చే విధంగా మాట్లాడినా స్పందించకుండా మౌనం పాటించడమేంటని కటువుగానే ప్రశ్నించారు. మీ స్థానంలో కొత్త వారు వస్తారని కూడా చంద్రబాబు హెచ్చరించారు.

**1995 నాటి సీఎంను చూస్తారని...**

ఇక తనలో 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారని, ఇప్పటి వరకూ పనితీరును మార్చుకుంటారేమోనని వెయిట్ చేశానని, కానీ కనీసం విపక్షాల విమర్శలకు సమాధానం చెప్పడంలో కానీ, ప్రభుత్వం ఏడాదిగా చేస్తున్న మంచి పనులను, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంలో కానీ ఫెయిలయ్యారని మంత్రులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గతంలో కాంగ్రెస్ తో పోరాటం అంటే సబ్జెక్ట్ పైనే ఉండేదని, ఇప్పుడు పూర్తిగా మారిపోయిందని, ప్రభుత్వం పై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు కౌంటర్ ఇవ్వగలిగేతే మనగలుగుతామని గుర్తుంచుకోవాలని చంద్రబాబు సీరియస్ గానే వార్నింగ్ ఇచ్చినట్లుతెలిసింది. కొత్త వారిని మంత్రులుగా తీసుకు రావడం తనకు క్షణాల్లో పని అని, కానీ ఆ పరిస్థితి కొందరు తెచ్చుకునేలా ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

**వ్యవసాయశాఖపై...**

సరిగా తమకు అప్పగించిన శాఖలపై కనీసం సమీక్షలు నిర్వహించడం లేదని, కొందరు జిల్లాల పర్యటనలకు కూడా వెళ్లడం లేదని ఫైర్ అయ్యారు. విపక్ష నేత జగన్ మిర్చి, పొగాకు ఈరోజు మామిడి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమయిందంటూ రోడ్డెక్కుతుంటే ఒక్కరూ మాట్లాడలేరా? ప్రభుత్వం రైతుల కోసం చేసిన పనిని ప్రజలకు వివరించలేరా? అని గట్టిగానే నిలదీసినట్లు తెలిసింది. వ్యవసాయ శాఖపైనే ఎక్కువగా విపక్షాలు విమర్శలు చేస్తున్నారని, ప్రతి ఒక్క మంత్రి సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మంత్రులు పార్టీ కార్యకర్తలకు, నాయకులకు గౌరవం ఇవ్వాలని కూడా చంద్రబాబు అన్నారు. అలా చేయకుండా ఉంటే మంత్రులను కేబినెట్ నుంచి తొలగిస్తానని గట్టిగానే హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది.

# కేసీఆర్, జగన్ అనుబంధంతో తెలంగాణకు తీరని నష్టం

- మొదటి పేజి తరువాయి

ఇందులో భాగంగా జగన్‌కు సలహాలు ఇవ్వడమే కాకుండా, టెండర్లు, జీవోల విషయంలోనూ సహకరించారు" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చిన నీటిని వచ్చినట్లే ఒడిసి పట్టుకోవాల్సింది పోయి, ఏపీకి వెళ్లాక చివరిలో తీసుకోవడం వల్ల తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని ఆయన అన్నారు. తుంగభద్ర, కృష్ణా జలాలు మొదట గద్వాలలోని జూరాలకు వస్తాయని, అక్కడే పాలమూరు-రంగారెడ్డి, నల్గొండ ప్రాజెక్టులకు నీటిని తరలించి ఉంటే ఏపీ జలాలను కొల్లగొట్టే అవకాశం ఉండేది కాదని రేవంత్ అభిప్రాయపడ్డారు. కేసీఆర్ తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్లే కృష్ణా పరివాహక ప్రాంత రైతులు నష్టపోయారని అన్నారు."గత ప్రభుత్వం సరిగ్గా వాదించి ఉంటే హైదరాబాద్ తాగునీటి సమస్య తీరేది. అంతేకాకుండా, ప్రాజెక్టులలో రాష్ట్రానికి రావాల్సిన వాటా కోల్పోవడం వల్ల తక్కువ ధరకు లభించాల్సిన విద్యుత్‌ను కూడా కోల్పోయాం" అని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు మరణశాసనం రాసే హక్కు కేసీఆర్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు.

# ప్రాజెక్టులకు జలకళ.. నాగార్జున సాగర్‌కు భారీ వరద

- మొదటి పేజి తరువాయి

జూరాల పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం7.95 టీఎంసీలుగా ఉంది. అదనంగా వస్తున్న వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి వస్తున వరదనీటితో శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారింది.శ్రీశైలంలో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 199.74 టీఎంసీల నీటి నిల్వ ఉంది. శ్రీశైలం గరిష్ట నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 882 అడుగులకు చేరింది. మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు అధికారులు. శ్రీశైలం నుంచి నీటి విడుదలతో నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు నీటి వరద పెరిగింది. సాగర్ కు ఎగువనుంచి 1లక్షా 17వేల 764 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. వరద నిలకడగా కొనసాగితే మరో వారం రోజుల్లో సాగర్ ప్రాజెక్టు నిండే అవకాశం ఉంది. ప్రస్తుతం సాగర్ నుంచి 4వేల 646 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు.

# హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

అధికారులు సన్‌రైజర్స్‌కు చెందిన కార్పొరేట్ బాక్స్‌కు తాళం వేయడం వివాదాస్పదమైంది. హెచ్‌సీఏ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం హైదరాబాద్ నుంచి తమ ఫ్రాంచైజీని తరలిస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలోనే హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావుపై తీవ్ర ఆరోపణలు చేసింది.ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు, జగన్మోహనరావు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చినట్లు తమ నివేదికలో నిర్ధారించారు. ఆ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసిన సీఐడీ, తాజాగా జగన్మోహనరావును అరెస్ట్ చేసి విచారణ చేపట్టింది.

# గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

- మొదటి పేజి తరువాయి

ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో నీటిపారుదల ప్రాజెక్టులపై ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. "ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను గత పదేళ్లలో పూర్తి చేసి ఉంటే, కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా దక్కేది. కానీ, గత ప్రభుత్వం వాటిని పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది" అని అన్నారు. అంతేకాకుండా, 2016లో కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని అపెక్స్ కౌన్సిల్‌కు గత ప్రభుత్వం లిఖితపూర్వకంగా తెలిపిందని ఆయన గుర్తు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకుంటున్నా, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ చేపట్టినా గత ప్రభుత్వం అడ్డుకోలేకపోయిందని ఉత్తమ్ ఆరోపించారు. "రాయలసీమ లిఫ్ట్ టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని కుట్రపూరితంగా వాయిదా వేశారు. దీనివల్ల ఏపీకి మేలు జరిగింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే నాగార్జునసాగర్ ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం ఉంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2019కి ముందే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే రాష్ట్రానికి ఎంతో మేలు జరిగేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాక ఏం చేస్తానంటే?

రాజకీయ జీవితం నుంచి విరమణ పొందిన తర్వాత తాను ఏమి చేయాలనుకుంటున్నారో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. తన భవిష్యత్ ప్రణాళికలను వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రజా జీవితానికి వీడ్కోలు పలికిన తర్వాత పూర్తి సమయం వేదాలు, ఉపనిషత్తుల అధ్యయనానికి కేటాయిస్తానని తెలిపారు. దీనితో పాటు ప్రకృతి వ్యవసాయంపై కూడా దృష్టి సారిస్తానని చెప్పారు. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన సహకార సంఘాల మహిళలతో మాట్లాడుతూ ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రసాయన ఎరువులతో పండించే పంటల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సేద్యం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని, అదే సమయంలో వ్యవసాయ ఉత్పాదకతను కూడా పెంచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా సహకార శాఖ మంత్రిగా తన బాధ్యతల గురించి కూడా అమిత్ షా

మాట్లాడారు. తనకు హోం శాఖ అప్పగించినప్పుడు అందరూ అది కీలక శాఖ అన్నారని, కానీ సహకార శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు హోం శాఖ కన్నా అదే పెద్ద శాఖ అని తాను భావించానని అన్నారు. దేశంలోని రైతులు, పేదలు, గ్రామాల సంక్షేమం కోసం ఈ శాఖ పనిచేస్తుండటమే దీనికి కారణమని ఆయన వివరించారు.

# ఒవైసీ కాలేజీని కూల్చివేయకపోవడంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందన

- మొదటి పేజి తరువాయి

ఆ కాలేజీలో 10,000 మందికి పైగా పేద ముస్లిం బాలికలు, యువతులు కేజీ నుంచి పీజీ వరకు ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యనభ్యసిస్తున్నారని మా దృష్టికి వచ్చింది" అని తెలిపారు. పేద ముస్లిం మహిళల అభ్యున్నతికి ఈ విద్యాసంస్థ ఎంతో దోహదపడుతోందని ఆయన అన్నారు.

ఒక సామాజిక ప్రయోజనం కోసం నడుస్తున్న సంస్థ కావడంతోనే మానవతా దృక్పథంతో ఆలోచించి కూల్చివేత చర్యలను నిలిపివేశామని రంగనాథ్ వివరించారు. అయితే, ఇతర ఎంఐఎం నేతల అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగానే వ్యవహరించామని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కబ్జా చేసిన అనేక భారీ నిర్మాణాలను కూల్చివేశాం. సుమారు రూ.1000 కోట్ల విలువైన

ఆస్తులను మజ్లిస్ నాయకుల నుంచి స్వాధీనం చేసుకున్నాం. చాంద్రాయణగుట్టలో ఓ ఎంఐఎం కార్పొరేటర్ స్థలాన్ని కూడా రికవరీ చేశాం" అని ఆయన గుర్తుచేశారు.

కేవలం సామాజిక కారణాలతోనే ఫాతిమా కాలేజీపై చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నామని, దీన్ని బలహీనతగా చూడవద్దని ఏవీ రంగనాథ్ పరోక్షంగా ప్రస్తావించారు.

# రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్రమంత్రి గ్రీన్ సిగ్నల్.. యూరియా అధిక వాడకంపై ఆందోళన

- మొదటి పేజి తరువాయి

ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో భేటీ అయి రాష్ట్రానికి యూరియా కోటాను పెంచాలని కోరారు. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా యూరియాను వెంటనే సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. సరఫరా అయిన యూరియాను వ్యవసాయేతర పనులకు మళ్లించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అన్ని జిల్లాలకు సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు.

అదే సమయంలో, తెలంగాణలో యూరియా వాడకం పెరగడంపై మంత్రి నడ్డా ఆందోళన వ్యక్తం చేశారు. 2024-25 యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో యూరియా అమ్మకాలు ఏకంగా 21 శాతం పెరిగాయని ఆయన గుర్తు చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. 'ప్రణామ్' పథకం కింద రాష్ట్రాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని ఆయన వివరించారు.

# చైనాతో కాదు, టిబెట్‌తోనే మాకు సరిహద్దు

అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు, చైనాకు గట్టి షాకిచ్చేలా కీలక వ్యాఖ్యలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చైనాతో అసలు సరిహద్దే లేదని, తమ రాష్ట్రానికి టిబెట్‌తో మాత్రమే సరిహద్దు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదంపై కొత్త చర్చకు దారితీశాయి.

ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పెమా ఖండు ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా, అరుణాచల్ ప్రదేశ్ చైనాతో 1200 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటుందని విలేకరి ప్రస్తావించగా, సీఎం ఖండు వెంటనే కలగజేసుకున్నారు. "ఈ విషయంలో నేను మిమ్మల్ని సరిదిద్దాలి. మాకు చైనాతో కాదు, టిబెట్‌తో సరిహద్దు ఉంది" అని ఆయన వివరించారు. భారతదేశంలోని ఏ రాష్ట్రానికీ చైనాతో సరిహద్దు లేదని ఆయన అన్నారు.చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ, 1950లో చైనా టిబెట్‌ను బలవంతంగా ఆక్రమించుకుందని పెమా ఖండు గుర్తుచేశారు. "అధికారికంగా టిబెట్ ఇప్పుడు చైనా ఆధీనంలో ఉందని మాకు తెలుసు. కానీ వాస్తవానికి మా సరిహద్దు ఎప్పుడూ టిబెట్‌తోనే ఉండేది. అరుణాచల్ ప్రదేశ్ భూటాన్, మయన్మార్‌లతో పాటు టిబెట్‌తో అంతర్జాతీయ సరిహ ద్దులను పంచుకుంటోంది" అని ఆయన తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌ను తమ భూభాగంలోని దక్షిణ టిబెట్ (జాంగ్నాన్) అని చైనా చాలాకాలంగా వాదిస్తోంది. తమ మ్యాపుల్లో కూడా చూపి స్తూ వివాదాన్ని రాజేస్తోంది. అయితే, చైనా వాదనలను భారత్ ఎప్పటికప్పుడు తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని తేల్చి చెబుతోం ది. ఈ నేపథ్యంలో పెమా ఖండు చేసిన వ్యాఖ్యలు చైనా వాదనను మరింత బలహీనపరిచేలా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఈ నెల 17న ఒక్క రైలును కూడా కదలనివ్వం

- మొదటి పేజి తరువాయి

విజయవంతం చేస్తామన్నారు. ఆ రోజు డెక్కన్ నుంచి ఢిల్లీ వైపు ఒక్క రైలును కూడా కదలనివ్వబోమని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో బీసీ వ్యతిరేకత పాతుకుపోయిందని ఆమె తీవ్రస్థాయిలో విమర్శించారు. తాను ఓబీసీ అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, ఇప్పుడు బీసీ వర్గాలకు న్యాయం చేసే గొప్ప అవకాశం వచ్చిందని కవిత అన్నారు. తెలంగాణ పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించేలా ఆయన చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(డి) ప్రకారం, పెంచిన రిజర్వేషన్లను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉందని, కేవలం ఒక జీవో జారీ చేస్తే సరిపోతుందని ఆమె గుర్తుచేశారు. ఇదే క్రమంలో, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ చేయబోదని, బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కవిత స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాలు.. ప్రియాంక గాంధీతో డీకే శివకుమార్ కీలక భేటీ

- మొదటి పేజి తరువాయి

ఈ ఊహాగా నాలకు మరింత బలం చేకూరినట్లయింది. ముఖ్యమంత్రి పదవి విషయంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠ ఈ భేటీతో తారాస్థాయికి చేరింది.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవిపై సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల మధ్య ఒప్పందం జరిగిందనే ప్రచారం బలంగా ఉంది. దీని ప్రకారం, తొలి రెండున్నరేళ్లు సిద్ధరామయ్య, ఆ తర్వాత మిగిలిన కాలానికి డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఒప్పందం ప్రకారమే త్వరలో డీకే ముఖ్యమంత్రి అవుతారని ఆయన వర్గం ఎమ్మెల్యేలు, మద్దతుదారులు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు.ముఖ్యమంత్రి కావాలనే తన ఆశను శివకుమార్ కూడా దాచుకోవడం లేదు. ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, "పదవిని ఆశించడంలో తప్పేముంది?" అంటూ తన మనసులోని మాటను పరోక్షంగా బయటపెట్టారు. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాత్రం తాను ఐదేళ్ల పూర్తికాలం పదవిలో కొనసాగుతానని ధీమాగా చెబుతున్నారు.ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రియాంక గాంధీతో డీకే శివకుమార్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. త్వరలోనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశమయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# వారిని కాల్చిపారేయండి షేక్ హసీనా ఆడియో లీక్.. బంగ్లాదేశ్‌లో కలకలం

- మొదటి పేజి తరువాయి

సంస్థలు ఈ వార్తను ప్రచురించాయి. దీని ప్రకారం, గత సంవత్సరం జులై 18న ఢాకాలోని తన అధికార నివాసం 'గణభబన్' నుంచి ఒక ఉన్నత పోలీస్ అధికారికి హసీనా ఫోన్‌లో ఈ ఆదేశాలు జారీ చేశారు."నిరసనకారులను అణచివేయడానికి ప్రాణాంతక ఆయుధాలు వాడండి. వాళ్లు ఎక్కడ కనిపిస్తే అక్కడ కాల్చేయండి" అని ఆమె ఆదేశించారు. ఈ ఆదేశాలు జారీ అయిన కొద్ది గంటలకే పోలీసులు నిరసనకారులపై బలప్రయోగం చేసినట్లు బీబీసీ నివేదిక వెల్లడించింది.కాగా, బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారి తీవ్ర అల్లర్లకు దారితీశాయి. ఈ ఘర్షణల్లో సుమారు 1,400 మంది మరణించినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఈ నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో హసీనా ప్రభుత్వం కుప్పకూలింది. అనంతరం ఆమె దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు.ప్రస్తుతం మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం హసీనాను తిరిగి దేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఆమెపై బంగ్లాదేశ్‌లో ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించడం కూడా గమనార్హం.

# కేంద్ర ప్రభుత్వం మెడలు వంచుతాం- సిఐటియు.




**అరకులోయ పెన్ పవర్ 9 :** పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని. కనీస వేతనం 26,000 చెల్లించాలనీ. బుధవారం అరకులోయ మండల కేంద్రంలో సిఐటియు యూనియన్ భగత్ రామ్ ఆధ్వర్యంలో సమ్మె నిరసన చేపట్టారు. దేశవ్యాప్త కార్మిక సంఘాలు పిలుపు మేరకు సమ్మెలో భాగంగా పద్మపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, కాఫీ హౌస్, పెట్రోల్ బంకులు వర్కర్స్ యూనియన్ సమ్మె చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సమ్మె జయప్రదం చేయాలని పెద్ద ఎత్తున మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించమని తెలిపారు. కేంద్రంలో పాలకవర్గాన్ని మెడలు వంచి కార్మికులకు నష్టం కలిగే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయించే విధంగా పోరాడుతామని. కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం దేశంలో ఉన్న సేవా రంగాలు ప్రభుత్వ రంగాలు ప్రైవేటు వ్యక్తులకు కారు చౌకగా కట్టబడుతున్నారని ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఉండవని అన్నారు. దేశంలో కార్మిక వర్గం ఐక్యంగా పోరాడుతున్నారని. కార్మికులకు ఎటువంటి హక్కులు లేకుండా చేయాలని కుట్రతో చట్టాలు రద్దుచేసి దొడ్డిదారిన కరోనా సమయంలో పార్లమెంట్లో 4 లేబర్ కోడ్స్ బిల్లు తీసుకువచ్చిందని తెలిపారు. దేశంలో కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని పోరాడుతుందని అన్నారు. 8 గంటల నుండి 10:00 గంటల వరకు పెంచడం పట్ల కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగంలో పనిచేసిన కనీస వేతనం 26,000 చెల్లించాలని. గిరిజన చట్టాలు హక్కుల్ని పక్కనపెట్టి ప్రైవేటుకరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అరుణ్ మాట్లాడుతూ లాభాలు వస్తున్న బ్యాంకులు ప్రైవేటీకరణ చేయాలని కుట్రను అడ్డుకోవాలని పేద ప్రజలు కష్టజీవులు ఎంతో బ్యాంకులు మేలు చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి నాగమ్మ, ప్రాజెక్ట్ నాయకులు వెంకటలక్ష్మి, ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాడి రాజు, ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ నాయకులు రఘు, ఏపీ టూరిజం ఆప్కస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మ, పిఎసిఎస్ సహకార సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అభిన, మిడ్డేమిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దామోదర్, కన్నమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కొండమ్మ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట్, బుద్దు, జిసిసి సోప్ వర్కర్స్ యూనియన్ కమంద్, ఐకెపి వివోఏ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న స్వామి భక్తుల సేవలో కందాళ శ్రీనివాస కుటుంబం





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూలై 9:** సింహాచలం దేవస్థాన గిరి ప్రదక్షిణ సందర్భంగా వచ్చే భక్తులకు అల్పాహారం అందించేందుకు ప్రతి సంవత్సరం అప్పన్న గిరి ప్రదక్షిణ సమయంలో రెండు రోజులు ముందుగా హైదరాబాద్ కూకట్ పల్లి నుండి కందాళ శ్రీనివాస్ కేటరింగ్ ఆధ్వర్యంలో వంద మంది కుటుంబ సభ్యులు, సహాయకులతో వచ్చి ఇక్కడే వంటలు అవసరాన్ని బట్టి మూడు నుండి ఐదురకాల అల్పాహారాన్ని భక్తులకు ఉచితంగా అందిస్తూన్నారు.

తయారీకి సంబంధించి పాత్రలను వస్తువులు పదార్థాలు హైదరాబాదు నుండి తీసుకుని వచ్చి మహార్పదార్థము స్వయంగా భార్య తయారు చేసి భక్తులకు అందజేస్తున్నారు. వారి ఆదాయంతో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నామని కందాల శ్రీనివాస్ తెలియజేశారు.

## 71 వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం





**గాజువాక: పెన్ పవర్,( జూలై 09:** మహా విశాఖ నగరపాలక సంస్థ 71వ వార్డు కుంచుమాంబ కాలనీలో సూపరిపాలన తొలి అడుగు మరియు వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు.. వార్డ్ కార్పొరేటర్ రాజాన రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్రాన్ని వైకాపా ప్రభుత్వం చిన్నభిన్నం చేసిందని అన్నారు.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని అన్నారు. సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అలాగే వార్డులో సుమారు 80 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు మరియు సీసీ కాలువల నిర్మాణం నిమిత్తము శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొండా జగన్, రౌతు శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, నరసింహ పాత్రుడు, గంధం శ్రీనివాసరావు, గాజువాక తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న చింతపల్లి యూనియన్ బ్యాంక్ సిబ్బంది



**స్టాఫ్ రిపోర్టర్,చింతపల్లి/ గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జులై 9:** అఖిలభారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్( ఏఐబిఈఏ) యూనియన్ పిలుపుమేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో గల యూనియన్ బ్యాంక్ వద్ద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది కె.వెంకటేష్,పి.ఉదయ శంకర్, పి.సూర్యకుమార్,టెంపరరీ వర్కర్లు మరియు బిజినెస్ కరస్పాండెంట్స్ మహేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకి వైద్య పరీక్షలు,అవగాహన కార్యక్రమం





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 9:**ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల నిర్వహించే విధంగా ఈ నెల కూడా నిర్వహించబడింది. ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రతి గర్భిణీ స్త్రీకు పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించడమేకాక, అవసరమైన రక్తపరీక్షలు కూడా చేయబడినట్లు ఆరోగ్య కేంద్ర అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ ఎస్కె. ఖాదర్ మస్తాన్ వలి గర్భిణీ స్త్రీల వైద్య తనిఖీలు నిర్వహించారు. ప్రతి గర్భిణీ స్త్రీ తగినంత శ్రద్ధతో వైద్యసేవలు పొందుతూ, తప్పనిసరిగా ఆసుపత్రిలోనే పురుడు పోసుకోవాలన్న సూచనలను ఆయన అందించారు.అలాగే ఆరోగ్య పరివేక్షకుడు యన్.త్రినాథరావు గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య విద్యను బోధిస్తూ, గర్భధారణ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణీకి ఐరన్ మరియు కాల్షియం మాత్రలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత మహిళల్లో సురక్షిత మాతృత్వంపై అవగాహన పెరిగే అవకాశం ఉందని ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

## కళ్యాణ మండపాలు బుకింగ్ అంతా పారదర్శకంగా ఉండాలని ఆన్లైన్ బుకింగ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ విశాఖపట్నం జూలై 9 :**వి ఎం ఆర్ డి ఎ కి చెందిన అన్ని రకాల కళ్యాణ మండపాలు బుకింగ్ విధానం అంతా పారదర్శ కంగా ఉండాలనే ఉద్దేశ్యం తో ఆన్లైన్ బుకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని విఎంఆర్ డి ఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ అన్నారు. బుధవారం ఉదయం వి ఎం ఆర్ డి ఎ బాలల థియేటర్ లో ఆన్లైన్ బుకింగ్ విధానా న్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ వి ఎం ఆర్ డి ఎ కి చెందిన అన్ని ఫంక్షన్ హాళ్లు ఆన్లైన్ లో ఉంచుతున్నామని, ప్రజలకు అవసరమైన తేదీల్లో ఆన్లైన్ లో చూసుకొని బుక్ చేసుకునే సదుపాయం కల్పించమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఎ కార్యదర్శి మురళీ కృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గంటాతో ఆనందపురం తహాశీల్దార్ మర్యాదపూర్వకంగా భేటీ



**భిమిలి , పెన్ పవర్,జులై 9 :**ఆనందపురం తహాశీల్దార్ గా నియమితులైన సూరిశెట్టి శ్రీనుబాబు బుధవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎం.వి.పి. కాలనీలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనందపురం తహాశీల్దార్ గా తోట శ్రీవల్లికి జిల్లా కలెక్టర్ గతంలో పోస్టింగ్ ఇచ్చిన విషయం విదితమే. అవినీతి ఆరోపణలున్న ఆమెను కనీసం మాట మాత్రంగానైనా చెప్పకుం డా కీలకమైన ఆనందపురం తహాశీల్దార్ గా నియమించడం పట్ల గంటా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో జిల్లా కలెక్టర్ ఆమె పోస్టింగ్ రద్దు చేసి.. భీమిలి డెప్యూటీ తహాశీల్దార్ గా పని చేస్తున్న శ్రీనుబాబును పదోన్నతిపై ఆనం దపురం తహసిల్దార్ గా నియమించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీనుబాబును అభినంది స్తూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆనం దపురం పరిసరాల్లో ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రెవిన్యూ విషయా ల్లో ప్రజలకు న్యాయం చేయాలన్నారు.

## పామాయిల్ సాగుతో రైతుకు అధిక దిగుబడులు....





**రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు....**

**నాతవరం,పెన్ పవర్ (జులై 09):** ఫామ్ ఆయిల్ సాగులో రైతులు అధిక దిగుబడిన సాధించవచ్చునని రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు అన్నారు.బుధవారం మండలంలో గల వలసంపేట పంచాయతీలో గల ధారాలమ్మ తల్లి గుడి వద్ద పామ్ ఆయిల్ విస్తరణ మహెూత్సవం పై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ ఎకరానికి ఫామ్ ఆయిల్ సాగుపై సంవత్సరానికి లక్ష రూపాయలు ఆదాయం వస్తుందని,అలాగే దళారి,దోపిడీ లేని పంట ఒక పామ్ ఆయిల్ సాగేనని ఆయన అన్నారు.జిల్లా ఆయిల్ ఫామ్ రైతు సంఘం అధ్యక్షులు పివి సీతారామరాజు మాట్లాడుతూ నీటి వసతి కలిగిన రైతులు అందరూ ఫామ్ ఆయిల్ పంటను నాటి అందులో ఒక్క,జాజి మరియు పిప్పళ్లు వంటి అంతర పంటలు వేసుకోవడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని తెలియజేశారు.పతంజలి ఫుడ్ సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏడాదికి రెండుసార్లు ఆదాయం వచ్చే పంట ఫామ్ ఆయిల్ సాగేనని రైతుల తెలుసుకోవాలని అన్నారు.ఏటా పామ్ ఆయిల్ సాగుతో రైతులు లాభాలు అర్జించడంతో నాతవరం మండలంలో రోజురోజుకు పామాయిల్ సాగు విస్తీర్ణం పెరుగుతుందని అన్నారు.అనంతరం పామ్ ఆయిల్ సాగు యాజమాన్య పద్ధతులు,ఎరువుల వాడకం తదితర అంశాలపై ఈ అవగాహన సదస్సులో వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు,వలసంపేట సర్పంచ్ ఇటం శెట్టి శ్రీనివాసరావు, కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ కే.రమేష్ ఏ.నాగేశ్వరరావు,రైతులు తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు మెగా పేరెంట్స్ మీటింగ్ అవసరమా?

- తక్షణమే ఉపాధ్యాయులను నియమించండి
- గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 9:** పాఠశాలలు తిరిగి ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ఇప్పటికీ మారుమూల ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరత దాదాపు అలాగే ఉండడం పట్ల గిరిజన విద్యార్థి సంఘం (జి.ఎస్.యు) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించడం దేనికి సంకేతమని ప్రశ్నిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మండిపడింది. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడిన గిరిజన విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి బూడిదే మాధవరావు మాట్లాడుతూ, "మా ఆదివాసీ పిల్లల ప్రాణాల మీద, చదువు మీద ఈ ప్రభుత్వానికి శిత్తశుద్ధి లేదు. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించకపోవడం నిందనీయం" అన్నారు.గత నెల పెదబయలు మండలంలోని ఎంపీపీ, ఆశ్రమ, జీపీఎస్ పాఠశాలలను సందర్శించిన సంఘం నాయకులు అక్కడ ఉపాధ్యాయుల కొరతను గుర్తించారని, సంబంధిత అధికారులకు పలు మార్లు తెలియజేశామన్నా సరైన స్పందన లేకపోయిందన్నారు. పెదబయలు మండలంలోనే 29 మంది ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నట్టు గుర్తించామన్నారు.మరి మిగతా 10 మండలాల్లో పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చని పేర్కొన్నారు.త్వరలో కలెక్టర్, ఐటిడిఎ పీఓ వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని వెల్లడించిన మాధవరావు, ట్రైబల్ వెల్ఫేర్ డిడి, డిఇఓలు స్వయంగా పాఠశాలలు సందర్శించి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు కీరసాని కిషోర్, డివిజన్ అధ్యక్షుడు మణుగూరు బాబుజి, పెదబయలు మండల అధ్యక్షుడు బోయిని అనిల్ తదితరులు పాల్గొన్నారు. "పాఠశాలల్లో ఉపాధ్యాయుల్లేకుండా పేరెంట్స్ మీటింగ్లు ఎందుకు? విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కావాలంటే తక్షణమే ఉపాధ్యాయుల నియామకం జరగాలి" అని సంఘం స్పష్టం చేసింది.

## సుపరిపాలన కూటమితోనే సాధ్యం

- వార్డ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాధం





**గాజువాక: పెన్ పవర్, జూలై 09:**సుపరిపాలన కుటమి తోనే సాధ్యమని వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం అన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నగర్ లో ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కూటమితోనే సాధ్యమని, సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీలను అమలుపరుస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సాగి విజయరామరాజు, సెక్రెటరీ బోట్టా ప్రకాష్, మాజీ హాస్పిటల్ కమిటీ చైర్మన్ రాజన్ రాజ్, సీనియర్ నాయకులు పావాడ వెంకట రమణమూర్తి, వై నాగేశ్వరరావు, జాన్ రమేష్, కళ్యాణ చక్రవర్తి, రామకృష్ణ, ఆర్పీ దీప, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికుల నిరసనతో దద్దరిల్లిన ముంచంగిపుట్టు







- కార్మిక చట్టాలు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటి కరణను వ్యతిరేకిస్తూ నిరసన.
- నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి.
- సుప్రీంకోర్టు తీర్పు అనుగుణంగా కార్మికులకు 26వేల రూపాయలు కనీస వేతనం చెల్లించాలి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 09.** కార్మికుల నిరసనతో ముంచంగిపుట్టు మండల కేంద్రం దద్దరిల్లింది. కార్మిక సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నూతన కార్మిక చట్టాలు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చర్యలను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల కేంద్రంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ అతిథి గృహం నుండి స్థానిక కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ.. అఖిలభారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె చేయాలనే పిలుపుమేరకు నిరసన తెలుపుతున్నామని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లు తక్షణమే రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లకు సుప్రీంకోర్టు తీర్పు అనుగుణంగా 26వేల రూపాయల చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని, కార్మికుల కొరకు ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన యాప్ లను రద్దు చేయాలని, నల్ల చట్టాలు వెంటనే రద్దు చేయాలని అన్నారు. కార్మిక సంఘాల సంక్షేమానికి పెద్దపీట వేయాలని, లేకుంటే భవిష్యత్తులో కార్మికుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేయక తప్పదని హెచ్చరించారు. తదనంతరం సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు మాట్లాడుతూ.. కార్మికులపై భారం మోపిన లేబర్ కోడ్ లను తక్షణమే మోడీ ప్రభుత్వం రద్దు చేయాలని, యాప్ ల పేరుతో కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని, చాలీచాలని జీతాలతో కుటుంబాలు పోషించుకోవడం కష్టంగా ఉందన్నారు. తమ డిమాండ్లను పరిగణలో తీసుకొని న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎం ఎం శ్రీను, భీమరాజు, నర్సింగ్, గాసిరందొర, రామదాసు, విజయ, ఎస్ పార్వతి, కే శాంతమ్మ, జయసుధ, సత్యవతి, పార్వతమ్మ, కుమారి, గణపతి, బాలన్న, బాలకృష్ణ, చంద్ర, అంగన్వాడి,ఆశ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పంచాయతీల అభివృద్ధికి పిఎఐ తోడ్పాటు

- మండల అభివృద్ధి అధికా రి వి సత్యనారాయణమూర్తి.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 09.** ముంచంగిపుట్టు మండల పరిషత్ సమావేశ కార్యాలయంలో పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ 2.0 కార్యక్రమం నిర్వహించామని, పంచాయతీల అభివృద్ధికి పిఎఐ తోడ్పాటు అందిస్తుందని మండల అభివృద్ధి శాఖ అధికారి వి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులు మరియు సచివాలయం డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు,పంచాయతీ కార్యదర్శులు ఒకరోజు ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించమన్నారు. దీనిలో భాగంగా పంచాయతీ పరిధిలో ఏ రంగంలో వెనుకబడి ఉందో పిఎఐ ద్వారా ప్రగతి సాధించుటకు తద్వారా పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. అన్ని శాఖల అధికారులు విధిగా ఖచ్చితమైన ప్రోగ్రెస్ రిపోర్ట్ అందజేయలని, కార్యక్రమంలో చర్చించిన విషయాలను ప్రగతి యాప్ నందు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాల సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలోని రెడ్ క్రాస్ శాశ్వత భవనం కొరకు రాష్ట్ర శాఖకు వినతి






**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 9:** అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత భవనం నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలని రాష్ట్ర శాఖకు గవర్నర్ సమక్షంలో రాష్ట్ర చైర్మన్ డాక్టర్ వై డి రామారావు కు అల్లూరి సీతారామరాజు జిల్లా బృందం వినతి పత్రం అందజేశారు.బుధవారం విజయవాడలో గల తుమ్మనపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఆరవ వార్షిక సర్వసభ్య సమావేశానికి జిల్లా బృందం హాజరైనన్నారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ నజీర్ పాల్గొని ప్రసంగించారు. ఏజెన్సీలో సీజనల్ వ్యాధుల పట్ల, సికెన్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి మీ ఇంటికి మీ డాక్టర్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రక్తపు నిలువలు పెంచి ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు రెడ్ క్రాస్ సొసైటీ ఎంతగానో కృషి చేస్తుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ గంగరాజు ప్రధాన కార్యదర్శి జి.గౌరీ శంకర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు,కోశాధికారి సూర్యారావు, సభ్యులు సంజీవరావు,రవి,శ్రీనివాస్, ప్రసాద్, విజయలక్ష్మి, కృపారావు, సుబ్రహ్మణ్యం జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలి.

- ప్రతి ఒక్కరు ఒకటికి మించి మొక్కలు నాటి పెంచండి
- శీతోష్ణస్థితి వేడెక్కడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి
- తల్లికి వందనం పేరుతో మొక్కలు నాటండి
- డాక్టర్ శ్వేత, డెర్మటాలజిస్ట్



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,విశాఖపట్నం, జులై 09 :** ప్రతి ఒక్కరు ఒకటికి మించి మొక్కలు నాటి పెంచండి అని డెర్మటాలజిస్ట్ డాక్టర్ శ్వేత పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం విశాఖపట్నం జిల్లా, ఎంవిపి కాలనీ లోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ విద్య సంస్థలో మొక్కలు నాటిన అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి శీతోష్ణస్థితి వేడెక్కకుండా చూడాలని కోరారు. చెట్లను కాపాడండి ప్రాణవాయువుని పెంపొందించండి అని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వనరులను కాపాడాలని కోరారు. తమ కుటుం బంలో ఉన్న వారందరికీ పర్యావరణ పరిరక్షణ, ఒక సారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వల్ల వచ్చే వ్యా ధుల గురించి వివరించాలని చెప్పారు
ఈ కార్యక్రమంలో విద్యా సంస్థ హెడ్ మిస్ట్రెస్ జాస్లిన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒకటికి మించి మొక్కలు నాటాలని కోరారు. పర్యావర ణ హితంగా జీవించాలన్నారు. సమస్త జీవరా శిని కాపాడాలి అని విస్తృత ప్రచారం నిర్వహిం చాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జే వి రత్నం మాట్లాడుతూ పండ్లు జాతి, పక్షులు గూళ్ళు పెట్టుకునే, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటి వనాలు పెంచాలని కోరారు. భూమి మీద ఏ జీవి అంతరించినా దాని దుష్ప్రభావం మానవాళి మీద పడుతుంద న్నారు.
ఈ కార్యక్రమంలో సంస్థ ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, డాక్టర్ జనపరెడ్డి లిఖిత, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక సంస్థ ఫెసిలిటేటర్ ఐ కృష్ణకు మారి, గ్రీన్ క్లైమేట్ టీమ్ సంస్థ కోఆర్డినేటర్ జె రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# ప్రతి చిన్నారికి ఆధార్ నమోదు

**ఐటీడీఏ ఇంచార్జి పిఓ,**
**జెసి డాక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ**






**స్టాఫ్ రిపోర్టార్,పాడేరు/ గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 9:** ప్రతి చిన్నారికి తప్పని సరిగా ఆధార్ నమోదు చేయాలని ఐటిడిఏ ఇంచార్జి ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎం.జె.అభిషేక్ గౌడ ఆదేశించారు.బుధవారం ఐటిడిఏ కార్యాలయంలో గ్రామ వార్డు సచివాలయం, ఐసిడిఏస్,పిఎంయు అధికారులతో చిన్నారులకు ఆధార్, జనన ధృవీ కరణ పత్రాలు జారీపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఏ పరిధిలో 4765 మంది పిల్లలకు ఆధార్ కార్డులు, 3484 మందికి జనన దృవీ కరణ పత్రాలు లేవన్నారు.ఈనెలాఖరు లోగా ఆధార్ లేని చిన్నారులకు ఆధార్ జారీ చేయాలని సూచించారు.జనన దృవికరణ పత్రాలు జారీకి సచివాలయం కార్యదర్శి, విఆర్ఓ,ఆర్ఐ, తాహాశీల్దారులు సమన్వయంతో జనన దృ వీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.ఆధార్ నమోదుకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు డబ్బులు చెల్లించాలని, మధ్య వర్తులు డబ్బులు చెల్లించకూడదన్నారు.ఈ సమావేశంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి వేంకటేశ్వరరావు,గ్రామ వార్డు సచివాలయం నోడల్ అధికారి 2.ఎస్.కుమార్,జిఎస్ డబ్లూఎస్ జిల్లా సమన్వయ కర్త కె. సునీల్, జి.మాడుగుల సిడిపిఓ కె.బిహెచ్. ఎం. మణి, పి ఎం యు అధికారి రాజేష్, ఆధార్ కో ఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అభివృద్ధి ప్రభుత్వం కరపత్రాన్ని విడుదల

- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సులు





**పద్మనాభం. పెన్ పవర్, జులై 09 :** ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సర్వీసును అమలు చేస్తున్నామని నియోజక వర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అయినాడా. బి.ఆర్ తాళ్లవలస గ్రామాల్లో బుధవారం చేపట్టిన సూపర్ పాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పాల్గొని మాట్లాడారు ముందుగా ఐనాడ గ్రామంలో ముందుగా రాజరాజేశ్వరి అమ్మవారు ఆలయం లో దర్శనం తీసుకొని అక్కడ నుంచి ప్రారంభిం చారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చే సిన సంక్షేమ పథకాలు అభివృద్ధి ప్రభుత్వం కరపత్రాన్ని విడుదల చేశారు ప్రతి ఇంటికి పంపి ణీ చేశారు అనంతరం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి స్థానిక నాయకుల సమస్యలు వివరించారు ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లీలావతి కుమారుడు అనిల్ సమస్యలను వివరించారు. గ్రామంలో ఎప్పటినుంచోడిపైన ఏతపేట తాగు నీటి సమస్య ఉందని అన్నారు. రేవి డి నుంచి కోరాడ బితాల వలస మీదుగా అయినాడు కలుపుకొని ఉన్న రహదారిని అభివృద్ధి చే యాలని దీనివల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొం టున్నామని వివరించారు. అనంతరం బి తాలవలసలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆ గ్రామానికి చెందిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కే రమణ. మా గ్రామం నుండి విజయనగరం జిల్లా జొన్నద గ్రామానికి పోవుటకు డిసిఎంఎస్ గ్రాంట్ కింద 70 లక్షలతో ఆ పనులు నిర్వహించడానికి ప్రతిపాదనలు పంపించామని అందుకు మంజూరు చేయాలని కోరారు. అన్ సేటిల్ విలేజ్ కింద ఉన్న గ్రామాన్ని 2015 లో ప్రభుత్వ అధికారుల చే సర్వే చేయించి రైతులకు అప్పగించారు అప్పట్లో కొంత భూభాగం ఉండిపోయిం దని దాన్ని కూడా పూర్తి చేసి రైతులకు ఇవ్వాలని ఆయన కోరారు. 1983 నుండి నేటి వరకు మా గ్రామం టిడిపి పార్టీకి ఎన్నికల్లో ఎప్పుడు మెజార్టీ ఇచ్చింది అన్నారు దానికి స్పందించిన గంట శ్రీనివాసరావు

## ఇల్లు లేని పేదలకు మూడు సెంట్ల స్థలం, ఇళ్ల పట్టాలు

- ప్రభుత్వం జీవో నెం. 23 ప్రకారం చర్యలు
- తహశీల్దార్ టి. రామకృష్ణ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్ జూలై 9:** మండలంలోని ఇల్లు లేని పేదలకు ప్రభుత్వం మూడు సెంట్ల స్థలంతో పాటు ఇళ్ల పట్టాలు మంజూరు చేయనుందని తహశీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. అందరికీ ఇల్లు కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల గృహ నిర్మాణ పథకాలలో లబ్ధి పొందినవారు అర్హులుగా పరిగణించబోరని స్పష్టం చేశారు.అలాగే, మండలంలో సొంత స్థలం కలిగిన వారు కూడా ఈ పథకం లబ్ధికి అర్హులుకావన్నారు. అర్హులైనవారు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.జీవో నెంబర్ 23 ప్రకారం ఈ ఇళ్ల పట్టాల మంజూరు జరుగుతుందని, అర్హుల వివరాలను వీఆర్వో లాగిన్ ద్వారా తహశీల్దార్ లాగిన్‌కు పంపించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.వీఆర్వోలు తమ లాగిన్లలో ఉన్న రేషన్ కార్డులు, కుల మరియు ఆదాయ ధృవపత్రాలను సకాలంలో సరి చూసుకుని పెండింగ్ లేకుండా చూడాలన్నారు.ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ సీతారాం, రీ-సర్వే డీటీ దుమంతి సత్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గిరి ప్రదక్షిణ రథం ప్రారంభం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం, జులై 09 :** సింహాచలం తొలి పావంచల దగ్గర గిరి ప్రదక్షిణ రథాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే గణబాబు, విశాఖ ఎంపీ ఎం.భరత్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్ప లనాయుడులతో కలిసి దేవస్థానం వంశపారం పర్య ధర్మకర్త అశోక్ గజపతిరాజు జెండా ఊపి బుధవారం ప్రారంభించారు. స్వామి వారి రథం కొండ చుట్టూ 32 కిలో మీటర్ల దూరం ప్రయా ణించి మళ్లీ తొలి పావంచల వద్దకు చేరుకుం టుంది. మార్గ మధ్యలో భక్తుల పూజలు అందుకుంటూ రథం ముందుకు సాగుతుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ వల్ల భూ ప్రదక్షిణ చేసిన పుణ్యం దక్కుతుందని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని.. దేవస్థానం, జీవీఎంసీ, పోలీస్ తదితర అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా గిరి ప్రదక్షిణ విజయవం తం చేస్తామని చెప్పారు. దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వేంద్ర త్రినాథరావు, కార్పొరేటర్ పి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## వీరమల్లు మూవీపై సూపర్ అప్ డేట్.. ఖచ్చితంగా బ్లాక్ బస్టరేనట




**హైదరాబాద్ పెన్ పవర్:** పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదలకు రెడీగా ఉంది. జులై 24 వ తేదీన ఈ మూవీ విడుదలకు మేకర్స్ అంతా సిద్ధం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. టాలీవుడ్ లోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా పవన్ కల్యాణ్ కు అభిమానులున్నారు. ఇప్పటికే విడుదలయిన ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్ అన్ని రికార్డులను బ్రేక్ చేసింది. ఇరవై నాలుగుగంటల్లోనే ఎక్కువ మంది వీక్షించి ట్రైలర్ గా రూపుదిద్దుకుంది. అయితే ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన వివాదాలు కూడా చుట్టుముట్టాయి.

**వివాదాలు చుట్టుముడుతున్నా...**

బీసీ సంఘాలు ఈ మూవీ కథపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. మరొకవైపు చరిత్రను వక్రీకకరించారని ఆరోపిస్తూ న్యాయవాది ఒకరు హెచ్చరించారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన తాజాగా ఒక అప్ డేట్ విడుదలయింది. మూవీరన్ టైమ్ పై నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతుంది. రన్ టైమ్ 160 నిమిషాలుగా చెబుతున్నారు. అంటే రెండు గంటల నలభై నిమిషాల్లో మాత్రమే ఉందని చెప్పడంతో తక్కువ రన్ టైమ్ తో విడుదలవుతున్న చిత్రంగా ఫిలింనగర్ వర్గాలు కూడా చెబుతున్నాయి.

**రన్ టైమ్ తక్కువగా ఉందంటూ...**

పౌరాణిక, ఆధ్యాత్మిక, చారిత్రక సినిమాలు దాదాపు మూడు గంటలకు పైగానే రన్ టైమ్ ఉంటుంది. కానీ ఇంత తక్కువ రన్ టైమ్ ఉన్న చిత్రంగా కూడా హరిహర వీరమల్లు రికార్డు క్రియేట్ చేయనుందని అంటున్నారు. నెగిటివ్ టాక్ రాకుండా ఉండేదుకు దర్శకుడు రన్ టైమ్ ను తగ్గించినట్లు చెబుతున్నారు. ఆడియన్స్ కు ఎక్కడా బోర్ కొట్టకుండా ఉండేందుకు రన్ టైమ్ తక్కువగా చేశారంటున్నారు. బలమైన కంటెంట్ తో వచ్చే మూవీ అని, ప్రేక్షకులు ఆదరిస్తారని మేకర్స్ చెబుతున్నారు. అందులోనూ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన తర్వాత విడుదలవుతున్న తొలి చిత్రం కావడంతో ఫ్యాన్స్ కూడా ఓపెనింగ్స్ తో రికార్డులను బ్రేక్ చేసే అవకాశాలున్నాయి.

## నిమిష ప్రియకు ఉరి శిక్ష ఖాయం.. అన్ని ప్రభుత్వాలు విఫలమయినట్లేనా?




**హైదరాబాద్ పెన్ పవర్:** కేరళకు చెందిన నర్సు నిమిష ప్రియకు ఈ నెల 16న ఉరిశిక్ష అమలు చేయనున్నట్లు యెమన్ ప్రభుత్వం తెలిపింది. నిమిష ప్రియ యెమెన్ జాతీయుడి హత్య కేసులో నిందితురాలిగా నిర్ధారించింది. అయితే ఈ హత్య కేసును విచారించిన అక్కడి న్యాయస్థానం ఆమెకు మరణ శిక్ష విధించింది. భారత ప్రభుత్వం నిమిష ప్రియ కుటుంబ సభ్యులతోనూ, యెమన్ అధికారులతోనూ సంప్రదింపులు చేస్తుంది. అయినా ఇప్పటికే శిక్ష ఖరారు కావడంతో ఉరిశిక్ష అమలు చేయడానికి యెమెన్ అధికారులు సిద్ధం చేశారు.

**2018లో హత్య చేసి...**

2018లో నిమిష ప్రియ యెమెన్ జాతీయుడిని హత్య చేసింది. 2008లో యెమన్ కు వెళ్లిన నిమిష ప్రియ అక్కడ అనేక ఆసుపత్రుల్లో నర్సుగా పనిచేసింది. తర్వాత స్వయంగా ఒక క్లినిక్ ను ఏర్పాటు చేసుకుంది. యెమన్ చట్టాలను అనుసరించి స్థానికులు ఖచ్చితంగా వ్యాపారాల్లో భాగస్వామిగా ఉండాలి. అందుకోసం నిమిష ప్రియ యెమెన్ జాతీయుడైన తలాల్ అబ్దో మహదిని భాగస్వామిగా క్లినిక్ లో చేర్చుకుంది. అయితే వీరిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు, వ్యాపారంలో విభేదాలు తలెత్తాయి.

**మత్తు ఇంజక్షన్ ఇచ్చి...**

దీంతో 2018లో యెమెన్ జాతీయుడైన తలాల్ అబ్దో మహదిని హత్య చేసింది. అతనికి మత్తు ఇంజెక్షన్ ఎక్కువగా ఇవ్వడంతో అతను మరణించాడు. డోస్ ఎక్కువ కావడం వల్ల మరణించాడని చెబుతున్నప్పటికీ ఆర్థిక లావాదేవీల కారణంగానే కావాలని హత్య చేసిందని న్యాయస్థానం నిర్ధారించింది. 2018లో ఆమెపై హత్యారోపణలు రుజువు కావడంతో యెమన్ కోర్టు మరణశిక్ష విధించింది. అయితే మానవ హక్కుల సంఘాలు, కుటుంబ సభ్యులు, భారత ప్రభుత్వం సంప్రదించినా యెమన్ ప్రభుత్వం అంగీకరించలేదు.

**రద్దు చేయాలంటే...?**

యెమన్ లో బ్లడ్ మనీ చట్ట ప్రకారం చాధిత కుటుంబం శిక్షను రద్దు చేయాలనుకుంటే నష్టపరిహారం చెల్లింపుతో శిక్షను నిలుపుదల చేయవచ్చు. కానీ తలాల్ అబ్దో మహది కుటుంబం మాత్రం క్షమాబిక్ష కోసం ముందుకు రాకపోవడంతో ఉరి శిక్షను అమలు చేయాలని యెమన్ ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని రకాల ప్రయత్నాలు విఫలం కావడంతో ఈ నెల 16న నిమిష ప్రియను ఉరితీసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జులై 16వ తేదీన మరి ఏం జరుగుతుందన్నది చూడాల్సి ఉంది.

# మరోసారి బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్




**హైదరాబాద్ పెన్ పవర్:** నీటిపారుదల అంశంపై అసెంబ్లీలో చర్చకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. పబ్ లు, క్లబ్ లలో కాదని ప్రజలు ఎన్నుకున్న శాసనసభలోనే చర్చించాలని కోరారు. బేసిన్లు, భేషజాలు లేవని నాడు కేసీఆర్ ఆంధ్రప్రదేశ్ కు కృష్ణాజలాల్లో అత్యధికంగా వాటా ఇచ్చారని అన్నారు. దీనిపై అవసరమైతే నాలుగు రోజులు చర్చ పెడదామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను చర్చకు రావాలంటూ సవాళ్లు విసురుతున్నానని అవసరమైతే నీటిపారుదల శాఖపైనాలుగు రోజుల పాటు అసెంబ్లీలో చర్చ పెడదామని, వచ్చిచర్చించాలని కోరారు. గత పదేళ్లు నీటి పారుదల శాఖను కల్వకుంట్ల కుటుంబ సభ్యులే నిర్వహించారని గుర్తు చేశారు.

**జగన్ తో లాలూచీ పడి...**

వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో లాలూచీ పడి రాయలసీమకు గోదావరి నీళ్లను తరలించుకు పోవచ్చని, రాయలసీమను రతనాలసీమ చేస్తానని కేసీఆర్ చెప్పింది వాస్తవం కాదా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ అనుభవాలు తెలుసుకుందామని తాను సభకు రావాలని కోరానని చెప్పానని అన్నార. జగన్ ను పిలిచి సలహాలు ఇచ్చి జీవోలు వచ్చిందాకా మౌనంగా ఉన్న కేసీఆర్ బ్యాచ్ ఇప్పుడు ఎలా మాట్లాడుతుందని నిలదీశారు. బీఆర్ఎస్ వాళ్లది వితండ వాదమని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ చేసిన ద్రోహానికి వంద కొరడా దెబ్బలు కొట్టినా తప్పులేదన్నారు. పాలమూరు రంగారెడ్డి నుంచి రెండు టీఎంసీల నీరు ఎత్తిపోయాల్సి ఉంటే దానిని కేసీఆర్ ఒక టీఎంసీకి తగ్గించింది నిజం కాదా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

**మరణ శాసనం రాసే హక్కు...**

కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని ప్రజలకు మరణ శాసనం రాసే హక్కు లేదని రేవంత్ రెడ్డి అన్నారు. నీళ్ల దోపిడీకి తెరలేపింది కేసీఆర్ మాత్రమేనని అన్నారు. అన్నింటికీ తలవొంచి తలూపడంతోనే నేడు ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఏ ప్రాజెక్టును కూడా కేసీఆర్ పదేళ్లలో పూర్తి చేయలేకపోయారన్నారు. చర్చ చేద్దామంటే కేసీఆర్ సభకు రారని అన్నారు. జగన్, కేసీఆర్ ల మధ్య ఏముందో మనకు అనవసరమని, కానీ తెలంగాణకు న్యాయంగా వచ్చే నీటిని చూసీ చూడనట్లు వదిలేసినందునే నేడు హైదరాబాద్ కు కూడా తాగు నీరు అందించలేకపోతున్నామని తెలిపారు. తప్పులన్నీ వాళ్లు చేసి నిందలు నేడు తమపై మోపుతున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. అనేక ప్రాజెక్టుల్లో ఆయకట్టును కూడా తగ్గించి తెలంగాణ ప్రజలకు ద్రోహం చేశారని రేవంత్ రెడ్డి అన్నారు.

# జగన్ పర్యటనలు ఇప్పుడే ఇలా ఉంటే.. భవిష్యత్ లో ఎలా ఉంటాయో?




**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ పర్యటనలు అంటేనే టెన్షన్ మధ్య సాగుతు న్నాయి. నిజానికి ఇది కేవలం ప్రభుత్వానికి మాత్రమే కాదు స్థానిక పోలీసులకు కూడా తలనొప్పిగా తయారయింది. జగన్ జిల్లాలకు వస్తున్నారంటే పోలీసులతో పాటు సిబ్బంది కూడా భయపడిపో తున్నారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా, ఎన్ని హెచ్చరికలుచేసినా బేఖాతరు చేస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ వివిధ వర్గాల సమస్యలపై జిల్లాలను పర్యటిస్తున్నారు. అయితే ఆయన పర్యటనలు వరసగా వివాదం అవుతుండటం, ఏదో ఒక అనుకోని ఘటనలు జరుగుతుం డటంతో శాంతిభద్రతల సమస్యగా మారుతుంది. పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా జరగాల్సిన నష్టం రిగిపోతూనే ఉంది.

**సమస్యలను పరిష్కరించలేని...**

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీకి సమస్యలను అడ్రస్ చేయడానికి ఆసక్తి చూపుతారు. అధికారంలో ఉన్నప్పుడు కనపడని సమస్యలు అధికారం లేనప్పుడు కనిపిస్తాయి. అది చంద్రబాబుకు అయినా.. జగన్ కు అయినా అంతే. కేవలం ఆంధ్రప్రదేశ్ కు మాత్రమే కాదు అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి. ఏ మాత్రం అవకాశం ఉన్నా వెంటనే ప్రతిపక్ష నేతలు అక్కడకు వెళ్లి పరామర్శించి తాము ఉన్నామని ధైర్యం చెప్పే ప్రయత్నం చేస్తారు. నిజానికి ప్రతిపక్ష నేతలు ఎవరు ఎన్ని పర్యటనలు చేసినా ఆ సమస్యలు పరిష్కారం కావు. అధికారంలో ఉన్న పార్టీ మాత్రమే సమస్యలను పరిష్కరించేందుకు అవకాశముంటుంది. అది గిట్టుబాటు ధరలైనా? మరొకటైనా పవర్ లో ఉన్న పార్టీ స్పందిస్తేనే అనుకూలమైన నిర్ణయం వస్తుంది.

**ప్రయోజనం ఏముంటుంది?**

అది తెలిసినా ప్రజలు మాత్రం ప్రతిపక్ష నేతలు తమ వద్దకు వస్తే బాహ్య ప్రపంచానికి తెలుస్తుందని నమ్ముతారు. ఉదాహరణకు మిర్చి రైతుల సమస్యలపై గిట్టుబాటు ధరలు రావడం లేదని జగన్ గుంటూరు పర్యటనలు చేశారు. తర్వాత కొంత అధికార పార్టీలో హడావిడి కనిపించింది. ఆ సమస్య మళ్లీ ఇక కనిపించలేదు. ఇక పొగాకు కు మద్దతు ధర కల్పించాలంటూ రైతులు ఇబ్బందులు పడుతుండటంతో జగన్ పొదిల పర్యటన చేపట్టారు. తర్వాత కేంద్ర మంత్రి వచ్చి పొగాకు బోర్డును సందర్శించి వెళ్లారు. తర్వాత ఆ సమస్య పరిష్కారం అయిందో లేదో తెలియదు. ఇప్పుడు జగన్ బంగారు పాళ్యం పర్యటనలోనూ మామిడి రైతులు పరామర్శించారు. అయితే ఇది కూడా నాలుగు రోజుల తర్వాత అంతే.

**శాంతి భద్రతల సమస్యగా...**

కానీ జగన్ పర్యటనల్లో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కార్యకర్తలు భారీగా తరలి వస్తుండటంతో పోలీసులు అదుపు చేయలేకపోతున్నారు. పొదిలి పర్యటనలో టీడీపీ కార్యకర్తలకు, వైసీపీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ జరిగింది. జగన్ పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో ఒక వ్యక్తి మరణించడం కలకలం రేపింది. దీనిపై జగన్ తో పాటు పలువురిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఈరోజు తాజాగా బంగారుపాళ్యం ఘటనలో కార్యకర్తలు పోలీసుల లాఠీఛార్జిలో తీవ్రంగా గాయపడ్డారు. జగన్ పర్యటనలు కొన్ని రోజుల ముందు హైటెన్షన్ మధ్య కొనసాగుతుండటంతో పోలీసులకు తలనొప్పిగా తయారయ్యాయి. అలాగని పర్యటనలకు అడ్డు చెప్పలేరు. నిబంధనలు పెట్టినా అమలు కావు. మరి మరో నాలుగేళు ఇలాగే కొనసాగాల్సిందేనా? అన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# ఆ ఇరవై నియోజకవర్గాలను పవన్ వదిలేశారా? అటు వైపు చూడరేంటి?

**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయింది. గత ఎన్నికల్లో జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో పోటీ చేసి విజయం సాధించింది. అయితే జనసేన అధినేతగా పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు ఆయా నియోజకవర్గాల్లో పర్యటించి వచ్చారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమిలోని ఇతర పార్టీల అభ్యర్థుల తరుపున కూడా ప్రచారం చేసినప్పటికీ తన పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఎన్నికలకు ముందు పర్యటించిన జగన్ కనీసం గెలిచి ఏడాది గడుస్తున్నప్పటికీ ఆ నియోజకవర్గాలకు వెళ్లడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 21 శాసనసభ నియోజకవర్గాల్లో జనసేన ఎమ్మెల్యేలు ఉంటే కనీసం అక్కడ పర్యటించేందుకు కూడా పవన్ కల్యాణ్ కు తీరికలేదా? అని ప్రశ్నిస్తున్నారు.

**ఏడాది గడుస్తున్నా...**

తాము ఎమ్మెల్యేలుగా ఉన్న నియోజకవర్గాల్లో అధికారులు తమ మాట వినడం లేదని, అక్కడ టీడీపీ ఇన్ ఛార్జుల మాటే చెల్లుబాటు అవుతుందని, తమను అధికారంలో ఉన్న వారిగా అధికారులు కూడా పరిగణించడం లేదని ఎమ్మెల్యేలు మొత్తుకుంటున్నా అటు వైపు జనసేనాని చూడకపోవడంపై పార్టీలో చర్చ జరుగుతుంది. కనీసం హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేటు సాధించిన తన విజయానికి కారణమైన నియోజకవర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు కూడా పవన్ కల్యాణ్ సమయాన్ని వెచ్చించకపోవడంపై నేతలు నిరాశ చెందుతున్నారు. స్థానిక కార్యకర్తలు కూడా పవన్ కల్యాణ్ ను ఎప్పుడు నియోజకవర్గానికి తీసుకువస్తారని ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తున్నారు.

**సమస్యలను చెప్పుకుందామంటే...**

కూటమి ప్రభుత్వంలో తమ నియోజకవర్గాల్లో పేరుకుపోయిన సమస్యలను చెప్పుకుందామంటే పవన్ కల్యాణ్ కనీసం ఇటు వైపు చూడకపోవడమేంటన్నది ఎమ్మెల్యేలు కూడా నిరాశ చెందుతున్నారు. పవన్ కల్యాణ్ తమ నియోజకవర్గానికి ఒకసారి




వచ్చి ప్రజలతో కలిసి బహిరంగ సభ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా వివరిస్తే బాగుంటుందని చెబుతున్నారు. ప్రజల్లో పవన్ కల్యాణ్ నోటి ద్వారా వచ్చే మాటలకు ఎక్కువ విశ్వసనీయత ఉంటుందని, తాము మరోసారి ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలన్నా, మరొకసారి ఈ నియోజకవర్గం నుంచి గెలవాలన్నా పవన్ పర్యటనలను నియోజకవర్గాల్లో చేయాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారు.

**షూటింగ్ లవల్లనేనంటూ**

అసలు తాను ప్రాతినిధ్యం వహించిన పిఠాపురం నియోజకవర్గానికే పవన్ కల్యాణ్ చుట్టపు చూపుగా వచ్చిపోతున్నారని, ఇక 20 నియోజకవర్గాల్లో ఎలా పర్యటిస్తారని కొందరు సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. అయితే పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన ఆయన గతంలో అంగీకరించిన సినిమాల షూటింగ్ ల కారణంగా వాయిదా పడుతూ వస్తుందని, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించడానికి ప్లాన్ చ్నేన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయినాసరే ఏడాదయినా ఓటేసిన తమను పట్టించుకోలేదన్న ఆవేదనలో ప్రజలు ఉన్నారని, పవన్ కల్యాణ్ కనీసం వారానికి ఒక నియోజకవర్గంలోనయినా పర్యటించాలని జనసేన ఎమ్మెల్యేలు కోరుతున్నారు. మరి పవన్ పర్యటనలు ఇకమీదైనా ఉంటాయా? లేదా? అన్నదితేలాల్సి ఉంది.

# భారతీయ విద్యార్థులకు ఇదో హెచ్చరికా?




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులకు ఇది కొంత ఆందోళన కలిగించే వార్త. గత సంవత్సరంతో పోలిస్తే, ఈ ఏడాది మార్చి నుండి మే మధ్యకాలంలో ఎఫ్-1 (%ఖీ%-1) విద్యార్థి వీసాల జారీలో 27 శాతం భారీ తగ్గుదల నమోదైనట్లు అమెరికా విదేశాంగ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ తగ్గుదల కరోనా మహమ్మారి సమయంలో జారీ అయిన వీసాల సంఖ్య కంటే కూడా తక్కువగా ఉండటం గమనార్హం.

**గణాంకాల విశ్లేషణ**

సాధారణంగా, అమెరికాలో ఆగస్టు/సెప్టెంబర్‌లో విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. దీనికి అనుగుణంగా మార్చి నుండి జూలై మధ్యకాలం వీసా దరఖాస్తులకు కీలక సమయంగా పరిగణించబడుతుంది. అయితే ఈ సంవత్సరం ప్రారంభంలోనే గణనీయమైన తగ్గుదల కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. 2024 మార్చి%-%మే మధ్య కేవలం 9,906 వీసాలు మాత్రమే జారీ అయ్యాయి. 2023లో ఇదే కాలంలో 14,987 వీసాలు జారీ అయ్యాయి. 2022లో 10,894 వీసాలు జారీ అయ్యాయి. కరోనా సమయంలో కూడా: ఈసారి జారీ అయిన సంఖ్య కంటే ఎక్కువగా వీసాలు మంజూరయ్యాయి. ఈ గణాంకాలు భారతీయ విద్యార్థుల వీసా జారీ ప్రక్రియలో అనూహ్యమైన మార్పులను సూచిస్తున్నాయి.

**తగ్గుదలకు కారణాలు**

2023%-%2024 విద్యా సంవత్సరానికి అమెరికా వెళ్లిన అంతర్జాతీయ విద్యార్థుల్లో భారతీయులే అగ్రస్థానంలో నిలిచినా, ఈ ఏడాది వీసాల జారీలో కొన్ని అంశాలు ప్రభావం చూపాయి. అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాల్లో పాలస్తీనాకు మద్దతుగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై అధికారులు చర్యలు తీసుకోవడం, కొందరి వీసాలను రద్దు చేయడం భారతీయ విద్యార్థుల్లోనూ ఆందోళన రేకెత్తించింది. మే 27 నుండి జూన్ 18 వరకు సుమారు రెండు వారాల పాటు అమెరికా వీసా దరఖాస్తులను తాత్కాలికంగా నిలిపివేయడం వెనుక "సోషల్ మీడియా వెట్టింగ్" పేరుతో భద్రతా తనిఖీలను కఠినతరం చేయడమే ప్రధాన కారణం. ఇది వీసా అపాయింట్‌మెంట్లను దాదాపు నిలిపివేసింది. రాబోయే అమెరికా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారంలోకి వస్తారనే ఊహాగానాలు కూడా ఒక కారణం. గతంలో ఆయన ప్రభుత్వంలో తీసుకున్న విద్యార్థి వ్యతిరేక విధానాలు గుర్తుకు రావడం కొంతమంది విద్యార్థులను తమ ప్రణాళికలను పునరాలోచించుకునేలా చేసింది.

**అమెరికా అధికారుల సూచన**

ఈ పరిణామాలపై స్పందించిన అమెరికా అధికారులు, "వీసా ప్రక్రియలో జాతీయ భద్రతకు అత్యధిక ప్రాముఖ్యత ఉంది. దరఖాస్తుదారులు వీలైనంత త్వరగా అపాయింట్‌మెంట్ కోసం అప్లై చేయాలి. ఇప్పటికే నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల షెడ్యూలింగ్ ప్రారంభించాం" అని పేర్కొన్నారు. అమెరికా ప్రయాణం కోసం ప్రయత్నిస్తున్న వారు వెంటనే తమ అపాయింట్‌మెంట్లను తనిఖీ చేసుకోవాలని, వీసా ప్రక్రియ పూర్తిగా 'వెట్టింగ్' ఆధారంగానే కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

**భారతీయ విద్యార్థులకు ముందస్తు ప్రణాళిక అవసరం**

ఈ గణాంకాలు భారతీయ విద్యార్థులకు ఒక రకంగా హెచ్చరికగానే భావించవచ్చు. గతేడాది కంటే తక్కువ సంఖ్యలో వీసాలు జారీ కావడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ, విద్యార్థులు ముందస్తు ప్రణాళిక, దరఖాస్తును సరిగ్గా నింపడం, అన్ని నిబంధనలను పాటించడం వంటి విషయాలపై దృష్టి సారించడం ముఖ్యం. ఆలస్యం చేయకుండా వీసా కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవడం మేలని నిపుణులు సూచిస్తున్నారు. భద్రతా తనిఖీలు కఠినతరం అయినందున, వీసా ప్రక్రియకు సాధారణం కంటే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది కాబట్టి, సకాలంలో దరఖాస్తు చేయడం ద్వారా అవాంతరాలను నివారించవచ్చు.

# జనసేన, పవన్, చిరంజీవిపై జక్కంపూడి రాజా కీలక వ్యాఖ్యలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొన్ని రోజులుగా ఏపీ రాజకీయాల్లో.. ప్రధానంగా గోదావరి జిల్లా రాజకీయాల్లో జక్కంపూడి ఫ్యామిలీ జనసేనలోకి వెళ్లిపోనుందనే ప్రచారం బలంగా నడుస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవల సోషల్ మీడియాలో ఈ తరహా ప్రచారం ఎక్కువవుతోంది. ఈ క్రమంలో ఆ ప్రచారాన్ని ఖండిస్తూ పవన్ పై రోజురోజుకీ విమర్శల డోసు పెంచుతూ.. తాజాగా మరోసారి క్లారిటీ ఇచ్చారు జక్కంపూడి రాజా.

అవును... జక్కింపూడి ఫ్యామిలీ జనసేనలో చేరుతుందనే ప్రచారంపై క్లారిటీ ఇచ్చారు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా. ఈ సందర్భంగా పవన్ పై ఘాటు విమర్శలు చేశారు. రెండు రోజుల క్రితం కాకినాడ జిల్లాలో వైసీపీ యువజన విభాగం అధ్యక్షులతో జరిపిన సమీక్ష సమావేశంలో పవన్ పై చేసిన విమర్శలను మించి అన్నట్లుగా స్పందించారు.తాజాగా రాజమండ్రిలో మీడియాతో మాట్లాడిన రాజా.. జక్కంపూడి కుటుంబానికి జనసేన పార్టీలో చేరాల్సిన అవసరం లేదని అన్నారు. తమ కుటుంబం వైసీపీలోనూ.. వైఎస్ జగన్ తోనూ ఉంటామని స్పష్టం చేశారు. ఇటీవల తాను జనసేన పార్టీలో చేరడానికి వారి ఆఫీసు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామని కొంతమంది చేస్తున్న ఆరోపణలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆయన కొట్టి పారేశారు. కొంతమంది సైకో ఫ్యాన్స్ తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. మతిభ్రమించి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని.. రాజకీయంగా ఎదగడానికి పవన్ దృష్టిలో పడటం కోసమే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు! ఇదే సమయంలో పవన్ పైనా విరుచుకుపడ్డారు. ఇందులో భాగంగా... అధికారంలో ఉన్నా అసెంబ్లీకి, కేబినెట్ మీటింగ్స్ కి హాజరు కాకుండా సినిమాలు చేసుకుంటున్నారని పవన్ పై విరుచుకుపడ్డారు.అయితే తాము మాత్రం పదవిలో ఉన్నా లేకపోయినా నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటామని అన్నారు. అదేవిధంగా.. ఎన్నికల ముందు సోనాలి ప్రీతికి ఏదో అయిపోయిందని గుండెలు బాదుకున్నవారికి.. ఇప్పుడు రాష్ట్రంలో వేలాది మంది మహిళలు అత్యాచారాలకు గురవుతున్న ఎందుకు పట్టించుకోవట్లేదని ప్రశ్నించారు.

ఇక... సినిమాలు వేరు, రాజకీయాలు వేరు అని చెప్పిన రాజా... చిరంజీవి అంటే తమ కుటుంబానికి అభిమానమని స్పష్టం చేశారు. తమ తమ్ముడు పెళ్లి శుభలేఖ ఇవ్వడానికి చిరంజీవి వద్దకు వెళ్తే.. జక్కంపూడి కుటుంబం గురించి గొప్పగా చెప్పారని.. జక్కంపూడి కుటుంబం రాజకీయాల్లో ఉండాలని ఏ పార్టీ అయినా కోరుకుంటుందని చిరంజీవి అన్నారని తెలిపారు.కాగా... ఇటీవల కాకినాడ జిల్లాలో వైసీపీ యువజన విభాగం అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జక్కంపూడి రాజా.. పవన్ కల్యాణ్ పై విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... గాజువాక, భీమవరం ప్రజలు రైట్, లెఫ్ట్ లెగ్ లతో తంతే పిఠాపురం వచ్చి పడ్డారని.. ఆయన ఏదో చేస్తారని పిఠాపురం ప్రజలు ఆశపడ్డారని అన్నారు.అయితే... ఏడాది గడిచినా కూడా పిఠాపురంలో అభివృద్ధి సున్నా అని జక్కంపూడి రాజా ఎద్దేవా చేశారు. పవన్ సీఎం అవుతానని చెప్పి.. మరొకరిని ముఖ్యమంత్రిని చేశారని తెలిపారు. ఇక, రాజకీయంగా జన్మనిచ్చిన పిఠాపురంలో పవన్ అంతం అయ్యేలా వచ్చే ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ విధంగా మైకు ముందుకొచ్చినప్పుడల్లా పవన్ పై విరుచుకుపడుతున్నారు రాజా!

# భారత్ కు వరం.. యాపిల్ సీఓఓగా భారత సంతతి సబీఖాన్.. ఈయన బ్యాక్ గ్రౌండ్ ఏంటంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ దిగ్గజం యాపిల్ కంపెనీలో భారత సంతతికి చెందిన వ్యక్తికి అత్యున్నత పదవిలో అవకాశం లభించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సబీ ఖాన్‌ను యాపిల్ కొత్త చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)గా నియమించినట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న జెఫ్ విలియమ్స్ పదవీ విరమణకు సిద్ధమవుతుండగా ఈ నెలాఖరుతో సబీ ఖాన్ అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నియామకం ప్రపంచ టెక్ రంగంలో భారతీయుల మేధస్సు, నాయకత్వాన్ని మరోసారి చాటిచెప్పింది.

**మూడు దశాబ్దాల పాటు యాపిల్‌కు సేవలందించిన సబీ**

సబీ ఖాన్ గత 29 ఏళ్లుగా యాపిల్ సంస్థలో వివిధ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) హోదాలో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యాపిల్ సరఫరా గొలుసు వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ అత్యాధునిక తయారీ టెక్నాలజీలు అభివృద్ధి చేయడంలో ఆయన పాత్ర కీలకంగా నిలిచింది. 2025 నుంచి సీఓఓగా పనిచేస్తున్న జెఫ్ విలియమ్స్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

**భారత్‌ను ప్రధాన మార్కెట్‌గా మార్చే దిశలో...**

యాపిల్ సంస్థ ప్రస్తుతం భారత్‌ను ఒక ప్రధాన తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని భావిస్తోంది. ఈ క్రమంలో భారత మూలాలున్న సబీ ఖాన్‌ను సీఓఓగా నియమించడం అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్ణయంగా చెప్పవచ్చు. భారత్‌లోని తయారీ యూనిట్ల విస్తరణ, సరఫరా వ్యవస్థ బలోపేతానికి ఇది ఒక పెద్ద మైలురాయిగా మారనుంది.

**సబీ ఖాన్ ఎవరు?**

1966లో ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో జన్మించారు. ప్రాథమిక విద్య సింగపూర్‌లో పూర్తి చేశారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీని పొందారు. 1995లో యాపిల్‌లో చేరారు. ఆయన తక్కువకాలంలోనే యాపిల్‌లో తన పనితీరు ద్వారా విశేష గుర్తింపు పొందారు.

**టిమ్ కుక్ ప్రశంసలు**

సబీ ఖాన్‌పై యాపిల్ సీఈఓ టిమ్ కుక్ ప్రశంసల వర్షం కురిపించారు. "సబీ ఒక అద్భుతమైన వ్యూహకర్త. యాపిల్ సరఫరా వ్యవస్థను స్థిరీకరించడంలో అత్యాధునిక తయారీ టెక్నాలజీలను
అభివృద్ధి చేయడంలో ఆయన అద్భుతమైన పాత్ర పోషించారు. ప్రపంచవ్యాప్తంగా ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించగల నాయకుడు ఆయన" అని కొనియాడారు. సబీ ఖాన్ నాయకత్వంలో యాపిల్ ఆపరేషన్లు మరింత దృఢంగా ప్రగతిశీలంగా మారుతాయని పరిశ్రమవర్గాలు ఆశిస్తున్నాయి.

## కాలం చెల్లిన మెడిసిన్స్ పై కేంద్రం కీలక ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏ ఇంట్లో అయినా జ్వరానికి.. జలుబుకు.. ఇతరత్రా కొన్ని జబ్బులకు నయం చేసేందుకు వీలుగా మెడిసిన్స్ ను ఉంచుకోవటం మామూలే. అయితే.. ఇలా ఇంట్లో ఉండే మెడిసిన్స్ కాలం చెల్లిన తర్వాత చెత్తతో పాటు బయట పడేస్తుంటారు. అయితే.. ఇలాంటి పని అస్సలు చేయొద్దంటూ కేంద్రం తాజాగా ఒక కీలక ప్రకటన చేసింది. అంతేకాదు.. ఇంట్లో ఉండే కాలం చెల్లిన మెడిసిన్స్ విషయంలో మరింత కేర్ ఫుల్ గా ఉండాలని చెబుతోంది.కాలం చెల్లిన ఔషధాల్ని ఆరు బయట పడేయటం ద్వారా.. ప్రజలకు.. జంతువులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని చెబుతోంది. ఈ అంశంపై తాజాగా కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ కొత్త వార్నింగ్ అలెర్టును జారీ చేసింది. అత్యంత ప్రమాదకరమైన 17 రకాల ఔషధాలకు సంబంధించి కీలక సూచన చేసింది.తీవ్రమైన నొప్పులు.. వ్యాకులత లాంటి రుగ్మతలను కంట్రోల్ చేసే ఔషధాల (ట్రమాడోల్.. టాపెంటాడోల్.. డయాజెపామ్.. ఆక్సికోడోన్.. ఫెంటానిల్)ను చించి.. అందులోని ట్యాబ్లెట్లను టాయిలెట్ లో వేసి ఫ్లష్ చేయాలని చెప్పింది. అంతే తప్పించి.. బయట చెత్తతో పాటు పడేస్తే పలువురికి అనారోగ్యానికి కారణమవుతుందని హెచ్చరించింది. సో.. మీ ఇంట్లో ఉండే మెడిసిన్స్ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

# తండ్రి బీజేపీ ఎమ్మెల్యే.. కొడుకు టీడీపీ ఇన్ చార్జి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో కూటమి రాజకీయాలు ఆసక్తి రేపుతున్నాయి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు కోసం పార్టీ మారిన టీడీపీ నేతలు.. సాంకేతికంగా బీజేపీ, జనసేనలో కొనసాగుతున్నప్పటికీ తమ మాతృ పార్టీతో బంధాన్ని తెంచుకోలేకపోతున్నారు. దీంతో తమ స్థానంలో వారసులను ప్రోత్సహించాలని టీడీపీ నాయకత్వంపై ఒత్తిడి చేస్తున్నారు. తాము ఇతర పార్టీలో ఉన్నా టీడీపీ వ్యవహారాలన్నీ తమ కంట్రోల్ లోనే ఉండేట్లు చూసుకుంటున్నారు. టీడీపీ అధిష్టానం కూడా మిత్రపక్షాలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో పార్టీపై దృష్టి పెట్టాలని నిర్ణయించడంతో రాష్ట్రంలోని 31 నియోజకవర్గాల్లో కొత్తగా ఇన్ చార్జిలను నియమించే అవకాశం కనిపిస్తోంది. గత ఎన్నికల ముందు బీజేపీ, జనసేనతో కూటమి కట్టిన టీడీపీ.. ఇప్పుడు ఆ రెండు పార్టీలకు కేటాయించిన అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ తరపున ఇన్ చార్జిలను నియమించాలని చూస్తోంది. ఇందులో భాగంగా బీజేపీకి కేటాయించిన 10, జనసేన ఎమ్మెల్యేలు ఉన్న 21 చోట్ల కొత్తగా టీడీపీ నేతలకు బాధ్యతలు అప్పగించాలని కసరత్తు జరుగుతోంది. రెండు మిత్రపక్షాలకు మొత్తం 31 సీట్లు కేటాయించగా, 29 స్థానాల్లో ఆ రెండు పార్టీలు గెలిచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, పార్టీ పరంగా కార్యకర్తలకు అండగా ఉండాలనే ఆలోచనతో నియోజకవర్గ ఇన్చార్జిలను నియమించాలని టీడీపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా అనపర్తి నియోజకవర్గ ఇన్చార్జిగా బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్ ను నియమించాలని భావించడం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. తండ్రి బీజేపీ ఎమ్మెల్యేగా ఉండగా, కుమారుడిని ఇన్చార్జిగా నియమించడంపై బీజేపీ స్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తి రేపుతోంది. ఎన్నికల ముందు అనపర్తిని బీజేపీకి కేటాయించగా, అప్పట్లో టీడీపీలో ఉన్న ఎమ్మెల్యే నల్లమిల్లి తిరుగుబాటు చేశారు. దీంతో నల్లమిల్లిని టీడీపీ నుంచి బీజేపీలోకి పంపి ఆ పార్టీ తరపున పోటీకి అవకాశం కల్పించారు ముఖ్యమంత్రి చంద్రబాబు. అయితే సాంకేతికంగా బీజేపీ ఎమ్మెల్యే అయినప్పటికీ నల్లమిల్లి మాత్రం టీడీపీతో సంబంధాలు వదులుకోలేకపోతున్నారు. ఎప్పుడైనా తనకు టీడీపీయే శాశ్వతమన్న భావనలో ఉన్న నల్లమిల్లి తనకు ప్రత్యామ్నాయంగా మరో నాయకుడికి అనపర్తి టీడీపీ పగ్గాలు అప్పగించకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారని అంటున్నారు. దీంతో ప్రస్తుతం కొత్త ఇన్ చార్జి అన్వేషణను టీడీపీ ప్రారంభించగానే, తన కుమారుడు మనోజ్ ను రంగంలోకి దించారు ఎమ్మెల్యే నల్లమిల్లి. ప్రస్తుతం కూటమిలో ఐకమత్యం దెబ్బతినకుండా తాను తెరవెనుక ఉండి తన కుమారుడిని టీడీపీలో యాక్టివ్ చేయాలని చూస్తున్నారని అంటున్నారు. పార్టీలో యువతరాన్ని ప్రోత్సహించాలన్న ఆలోచన ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేశ్ కూడా మనోజ్ కు అనపర్తి బాధ్యతలు అప్పగించేందుకు సుముఖంగా ఉన్నారని చెబుతున్నారు. దీంతో తండ్రి కమలం పార్టీ అయినా కుమారుడు పచ్చ కండువా కప్పుకుని నియోజకవర్గంలో చక్రం తిప్పాలని చూస్తున్నారని అంటున్నారు.

# సెల్ ఫోన్ చేతపట్టిన చంద్రబాబు... ఈసారి ఏమి చేశారంటే..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఫోన్ పట్టుకుని కనిపించడం అత్యంత అరుదైన విషయం అనే చెప్పాలి. అలాంటిది ఈ మధ్యకాలంలో అలాంటి అరుదైన ఘటనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా హెలీకాప్టర్ లో సెల్ ఫోన్ చేతపట్టి ఆయన పలు ఫోటోలు, వీడియోలు తీశారు. ఇప్పుడు అవి నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా గతంలో తీసిన సెల్ఫీలు చర్చకు వస్తున్నాయి.

అవును... ఏపీలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగెళ్లు పూర్తైన సందర్భంగా చంద్రబాబు సెల్ఫీ ఛాలెంజ్ విసిరిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... "చూడు జగన్ ఇవే మా ప్రభుత్వ హయాంలో పేదలకు నాడు నెల్లూరులో కట్టిన వేలాది టిడ్కో ఇళ్లు. టీడీపీ హయాంలో నిర్మించిన లక్షల ఇళ్లకు ఇవే సజీవ సాక్ష్యం" అంటూ చంద్రబాబు ట్విట్టర్ లో పోస్టులు చేశారు!ఇదే సమయలో... "ఈ నాలుగేళ్లలో నువ్వు కట్టిన ఇళ్లు ఎన్ని? నువ్వు కట్టిన ఇళ్లెక్కడ? జవాబు చెప్పగలవా?" అంటూ జగన్ ను ట్యాగ్ చేస్తూ సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. తన మొబైల్ ఫోన్ తో నెల్లూరులోని టిడ్కో గృహ సముదాయం వద్ద స్వయంగా సెల్ఫీ తీసి ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. నాడు సవాల్ కోసం అలా ఫోన్ చేతబట్టిన చంద్రబాబు.. ఇప్పుడు సంతృప్తిగా ఫోటోలు తీశారు!ఇందులో భాగంగా... శ్రీశైలం ప్రాజెక్టు వద్ద మంగళవారం కృష్ణమ్మకు పూజలు చేసి సారె సమర్పించి నాలుగు గేట్లు తెరిచి నీటిని దిగువకు వదిలారు. అనంతరం సున్నిపెంటలోని ప్రాజెక్టు ఉన్నత పాఠశాల మైదానంలో 'జలహారతి' పేరిట నిర్వహించిన బహిరంగసభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ విషయాలను ఎక్స్ వేదికగా వెల్లడించిన ఆయన.. చాలా సంతోషంగా ఉన్నట్లు తెలిపారు!ఈ సందర్భంగా... జులై తొలివారంలోనే శ్రీశైలం నిండటం శుభపరిణామమని.. శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చానని.. రాయలసీమ రతనాల సీమ కావాలని, రాష్ట్రం సుభిక్షం కావాలని శ్రీశైల మల్లన్నను ప్రార్థించానని చంద్రబాబు తెలిపారు. సమర్థ నీటి నిర్వహణతో సాగునీటి ఇబ్బందులు రాకుండా చేసే ప్రయత్నంలో అందరి సహకారం కోరినట్లు వెల్లడించారు.ఇదే విషయాన్ని ఏపీ సమాచార పౌరసంభందాల శాఖ ఎక్స్ వేదికగా వెల్లడించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు... హెలికాప్టర్ నుంచి శ్రీశైలం ప్రాజెక్ట్ ను, నదీ ప్రవాహాలను, పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారని తెలిపింది. దీనికి సంబంధించిన వీడియోను పోస్ట్ చేసింది.

## ముల్డర్ బయపడ్డాడు.. తప్పు చేశాడు.. నేనైతే కొట్టేవాడిని:
# సఫారీ ఆల్ రౌండర్‌పై గేల్ విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాఫ్రికా ఆల్ రౌండర్ వియాన్ ముల్డర్ టెస్టుల్లో లారా సాధించిన 400 పరుగుల వ్యక్తిగత స్కోర్ ను బ్రేక్ చేసేందుకు సువర్ణావకాశం లభించినా వదులుకోవడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. బులవాయో వేదికగా క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ లో ముగిసిన రెండో టెస్టు రెండో రోజు 367 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఉన్నప్పుడు సౌతాఫ్రికా తమ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. దీంతో ప్రపంచ క్రికెట్ మొత్తం ఒక్కసారిగా షాక్ కు గురైంది. లంచ్ తర్వాత రెండో సెషన్ లో ఈ సఫారీ కెప్టెన్ లారా రికార్డ్ బ్రేక్ చేస్తాడని క్రికెట్ అభిమానులు ఉత్కంఠగా ఎదురు చూసిన వారికి నిరాశే మిగిలింది. ముల్డర్ నిర్ణయంపై వెస్టిండీస్ విధ్వంసకర వీరుడు క్రిస్ గేల్ విమర్శలు వ్యక్తం చేశాడు.

ఒక రేడియో కార్యక్రమంలో మాట్లాడుతూ.. గేల్ తన నిర్ణయం పట్ల నిరాశ వ్యక్తం చేశాడు. అలాంటి అవకాశం వచ్చినప్పుడు వదులుకోకూడదని ప్రశ్నించాడు. “ నాకు 400 పరుగులు చేసే అవకాశం వస్తే.. నేను 400 పరుగులు చేసేవాడిని. ఇలాంటి అవకాశం ఎప్పుడో ఒకసారి మాత్రమే జరుగుతుంది. ముల్డర్ మళ్ళీ ఎప్పుడు ట్రిపుల్ సెంచరీ చేస్తారో తెలియదు. మీకు అవకాశం దొరికినప్పుడు మీరు భయపడకూడదు. రికార్డ్ బ్రియాన్ లారాతోనే ఉండాలని కోరుకుంటున్నానని చెప్పాడు. బహుశా అతను భయాందోళనకు గురై ఉండవచ్చు. ఆ పరిస్థితిలో ఏమి చేయాలో అతనికి తెలియలేదు. నేను చెప్పినట్లుగా, అతను భయపడ్డాడు. రికార్డ్ బ్రేక్ చేయకుండా తప్పు చేశాడు”. అని గేల్ చెప్పుకొచ్చాడు.

ఈ మ్యాచ్ లో సౌతాఫ్రికా కెప్టెన్ ముల్డర్ కావడం విశేషం. కెప్టెన్ గా ముల్డర్ జట్టు విజయం తీసుకున్న ఈ నిర్ణయం అందరి మనసులను గెలుచుకుంది. లంచ్ తర్వాత 5-10 ఓవర్లు సౌతాఫ్రికా బ్యాటింగ్ చేసినా లారా రికార్డ్ ను ముల్డర్ బ్రేక్ చేసేవాడు. అయితే 34 పరుగుల దూరంలో ప్రపంచ రికార్డ్ ఉన్నప్పటికీ తాను నిస్వార్ధంగా జట్టు కోసం ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేశాడు. దీంతో 367 పరుగులతో ముల్డర్ నాటౌట్ గా తన ఇన్నింగ్స్ ను ముగించాడు. దీంతో లారా రికార్డ్ పదిలంగా మిగిలింది. ఈ మ్యాచ్ లో ఓవరాల్ గా ముల్డర్ 334 బంతుల్లో 44 ఫోర్లు, 4 సిక్సర్లతో 367 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ నిర్ణయంపై కొంతమంది ప్రశంసించినా మరికొందరు నిరాశకు గురయ్యారు.

## కళ్లు చెదిరే రేంజ్‌కు పెరిగిన IPL బ్రాండ్ వాల్యూ..
# ముంబై, చెన్నైని వెనక్కి నెట్టి టాప్ ప్లేస్‌కు ఆర్సీబీ

**హైదరాబాద్ పెన్ పవర్:** క్యాచ్ రిచ్ లీగ్ ఐపీఎల్?కు ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ ఉంటారు. క్రికెట్ ఆడే దేశాల్లో ఐపీఎల్ అంటే తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఇంత క్రేజ్ ఉన్న ఐపీఎల్ విలువ రోజురోజుకు మరింత పెరుగుతోంది. ఈ విషయాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హౌలిహాన్ వెల్లడించింది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హౌలిహాన్ లోకే తాజా నివేదిక ప్రకారం.. ఈ ఏడాది ఐపీఎల్ వ్యాపార విలువ 12.9 శాతం పెరిగి 18.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది.



గత సంవత్సరం ఐపీఎల్ బ్రాండ్ వాల్యూ 13.8% పెరిగి 3.9 బిలియన్ డాలర్లకు చేరుకుందని నివేదిక పేర్కొంది. My11circle, Angel One, RuPay, CEAT%Å£”– నాలుగు అసోసియేట్ స్పాన్సర్ స్లాట్‌లను విక్రయించడం బీసీసీఐ రూ.1,485 కోట్లు ఆర్జించిందని బ్యాంక్ హౌలిహాన్ వెల్లడించింది. టాటా గ్రూప్‌తో ఐపీఎల్ టైటిల్-స్పాన్సర్‌షిప్ హక్కులను 2028 వరకు రూ. 2,500 కోట్లకు ఒప్పందం చేసుకుంది.ఇక, ఐపీఎల్ ఫ్రాంచైజీల విషయానికొస్తే 2025 టోర్నీ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) 269 మిలియన్ డాలర్ల బ్రాండ్ వాల్యూతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. -ఆర్సీబీ బ్రాండ్ వాల్యూ గత సంవత్సరం 227 మిలియన్ డాలర్ల ఉంది. రెండవ స్థానంలో టోర్నీలో అత్యధిక టైటిల్స్ గెలిచిన ముంబై ఇండియన్స్ నిలిచింది. 2025లో ముంబై బ్రాండ్ విలువ 242 మిలియన్లకు పెరగగా.. 2024లో 204 మిలియన్లు ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ 235 మిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో మూడవ స్థానానికి పరిమితమైంది. 2025 ఐపీఎల్ రన్నరప్ పంజాబ్ కింగ్స్ బ్రాండ్ విలువ ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. 2024 కంటే పంజాబ్ బ్రాండ్ విలువ 39.6% పెరిగింది. వీక్షకుల సంఖ్య విషయానికి వస్తే IPL 2025 ఫైనల్‌ను జియో హాట్‌స్టార్‌లో 67.8 కోట్లకు పైగా వీక్షించారు. -ఇది 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ కంటే ఎక్కువ వ్యూయర్ షిప్.

# నాలుగేళ్ల తర్వాత ప్లేయింగ్ 11లో ఆర్చర్.. లార్డ్స్ టెస్టుకు ఇంగ్లాండ్ జట్టు ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాతో లార్డ్స్ వేదికగా జరగబోయే మూడో టెస్టుకు ఇంగ్లాండ్ తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను అధికారికంగా ప్రకటించింది. గురువారం (జూలై 10) ప్రారంభం కానున్న ఈ మ్యాచ్ కు ఒక రోజు ముందు ఇంగ్లాండ్ తమ తుది జట్టును వెల్లడించింది. రెండో టెస్టులో ఇంగ్లాండ్ తో బరిలోకి దిగిన జట్టులో ఒక మార్పు చేసింది. ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్ స్థానంలో ఆర్చర్ కు ఇంగ్లాండ్ తుది జట్టులో చోటు కల్పించింది. దీంతో నాలుగేళ్ల తర్వాత ఆర్చర్ టెస్ట్ క్రికెట్ లోకి అడుగుపెట్టబోతున్నాడు. బుధవారం (జూలై 9) ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించిన ప్లేయింగ్ 11 లో 5 గురు బ్యాటర్లు.. ఒక వికెట్ కీపర్.. ఒక ఆల్ రౌండర్.. ముగ్గురు స్పెషలిస్ట్ సీమర్లు ఉన్నారు. ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ విషయానికి వస్తే ఓపెనర్లుగా బెన్ డకెట్, జాక్ క్రాలీ ఆడనున్నారు. మూడో స్థానంలో పోప్ బ్యాటింగ్ చేస్తాడు. సీనియర్ బ్యాటర్ జో రూట్, యువ సంచలనం హ్యారీ బ్రూక్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో బ్యాటింగ్ కు వస్తారు. కెప్టెన్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ ఆరో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. సూపర్ ఫామ్ లో ఉన్న వికెట్ కీపర్ బ్యాటర్ జెమీ స్మిత్ ఏడో స్థానంలో ఆడతాడు. సీనియర్ బౌలర్ క్రిస్ వోక్స్, ఆర్చర్,బ్రైడాన్ కార్సే ఫాస్ట్ బౌలింగ్ బాధ్యతలు పంచుకుంటారు. స్పెషలిస్ట్ స్పిన్నర్ గా షోయబ్ బషీర్ కు తుది జట్టులో స్థానం దక్కింది. యువ బ్యాటర్ బెథెల్‌తో పాటు, సామ్ కుక్, జామీ ఓవర్టన్ లకు రెండో టెస్టులోనూ బెంచ్ కు పరిమితమయ్యారు. గస్ అట్కిన్సన్ ఇంకా గాయం నుంచి కోలుకోలేదు. నాలుగో టెస్ట్ సమయానికి పూర్తి ఫిట్ నెస్ సాధించే అవకాశాలు ఉన్నాయి.

**నాలుగేళ్ళ తర్వాత ఆర్చర్ రీ ఎంట్రీ..**

ఆర్చర్ తన చివరి టెస్ట్ మ్యాచ్ ను 2021 ఫిబ్రవరిలో ఆడాడు. ఆ తర్వాత మోచేయికి శస్త్రచికిత్స చేపించుకొని సుదీర్ఘ ఫార్మాట్ కు దూరమయ్యాడు. ఈ క్రమంలో 2023 లో జరిగిన యాషెస్ తో భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్ కప్ కు దూరమయ్యాడు. జూలై 2న ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌తో ఇంగ్లాండ్ రెండో టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ లో ఆర్చర్ బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ జట్టులో అనుభవం లేని ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు. ఆర్చర్ జట్టులోకి వస్తే ఇంగ్లాండ్ బౌలింగ్ సమస్యలు తీరినట్టే.



జెనీలియా డిసౌజా తన సాంప్రదాయ ర్యాంప్ ప్రదర్శనతో తల తిప్పింది

# వ్యాయామం లేకుండానే వెయిట్ తగ్గిన నటి!

సెలబ్రిటీలు ఫిట్ నెస్ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటారు. ఫిట్ నెస్...రూపాన్ని కోల్పోతే సినిమాలతో మెప్పించే పరిస్థితి ఉండదు. ఈ విషయంలో సెలబ్రిటీలంతా జాగ్రత్తగా మరొకరు ఉండరన్నది అతి శయోక్తి కాదు. ఇలా ఎంత చేసినా ఒక్కోసారి అనుకోని సమస్యలు ఎదురవుతుంటాయి. అయినా ఆ పరిస్థి తుల్లోకి పూర్తి గా వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారు. మహమ్మారి క్యాన్సర్ నే జయించిన సెలబ్రి టీలు ఎంతో మంది. ఈ విషయంలో సెలబ్రిటీలు ఎంతో మందికి ఇన్ స్పిరేషన్ అని చెప్పాలి.

ఈ నేపథ్యంలో మహమ్మారి నుంచి బయడ పడిన సెలబ్రిటీలు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. ఎన్ జీవోలతో కలసి సమాజంలో తమ వంతు బాధ్యతగా పని చేస్తుంటారు. తాజాగా విద్యా బాలన్ కూడా అధిక బరువుతో తానెంత బాధపడిందన్న విషయాన్ని రివీల్ చేసింది. అది బరువు కాదు.. అధిక వాపు తో తీవ్రమైన అనారోగ్య బారి నుంచి తానెలా బయడ పడిందన్నది నలుగురుకి షేర్ చేసింది. కెరీర్ ఆరంభం నుంచే అధిక బరువుతో ఉండేదాన్ని. ఈ క్రమంలో చాలా విమర్శలు ఎదుర్కున్నా. సన్న బటడానికి ఎన్నో ప్రయత్నాలు చేసా. శరీరంలో కొవ్వు పేరుకుపోయిందని చేయాల్సినవన్నీ చేసా. కానీ ఏం లాభం లేదు. కానీ జిమ్ కు వెళ్లడం మానేసిన తర్వాత బరువు తగ్గాను. నా శరీరంలో ఉంది బరువు కాదు. వాపు అని గుర్తించా. దీనికి శాశ్వత పరిష్కారం కోసం ఈ ఏడాది మొదట్లో చెన్నైకి చెందిన %-%అమురి’ అనే న్యూట్రిషనల్ గ్రూప్‌ను సంప్రదించాను. తను శరీరంలో పేరుకుపోయింది కొవ్వు కాదని, అది కేవలం ఇన్ఫ్లమేషన్( అంటే శరీరంలో ఉండే ఒకరకమైన వాపు) అని తెలిపారు.వారు నాకోసం ఇన్ఫ్లమేషన్‌ను తొలగించే ప్రత్యేకమైన డైట్‌ను సూచిం చారు. అది నాకు మంచి ఫలితా న్నిచ్చింది. చాలా వరకూ బరువు తగ్గిపోయాను. అధిక భారం శరీరానికి చాలా అసౌకర్యానికి గురి చేస్తుంది. ఇప్పుడు ఎంతో విశాలంగా అనిపిస్తుంది. స్నేహితులంతా స్లిమ్ గా ఉన్నావ్ అంటున్నారు. శరీరమంతా ఎంతో తేలికగా ఉంది. కానీ ఆ డైట్ మొదలు పెట్టిన తర్వాత ఎలాంటి వ్యాయామాలు చేయకూడదు అనే కండీషన్ మర్చిపోకూడదు. ఆ డైట్ కి-వ్యాయామానికి సెట్ కాదు. దీంతో జిమ్ మానేసి ఇంట్లో తింటూనే బరువు తగ్గాను%-% అని తెలిపింది.



ఎరుపు రంగులో అదితి బుధతోకి స్టైసీ స్టిల్స్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com